ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -297 పేజీలు - 08 వెల - 04/- గురువారం 11 సెప్టెంబర్ 2025






అనంతపురంలో నిర్వహించిన 'సూపర్ సిక్స్.. సూపర్ హిట్' సభలో చంద్రబాబు

# కూటమి పాలన సూపర్ హిట్

- సంక్షేమం అంటే ఓట్ల రాజకీయం కాదు
- ప్రజల జీవన ప్రమాణం పెరగాలన్నదే తమ లక్ష్యం
- జగన్ కుటిల రాజకీయాలను సహించేది లేదు
- రప్పా..రప్పా అంటూ రాజకీయంచేస్తు ఊరుకోం
- రాయలసీమను రతనాల సీమగా మారుస్తాం
- అనంత సభలో సిఎంచంద్రబాబు నాయుడు
- ఆర్థిక ఇబ్బందులున్నా సూపర్ సిక్స్ అమలు
- గ్రామీణ రోడ్లకు కూటమి ప్రభుత్వం పెద్దపీట
- గిరిజన ప్రాంతాల్లో డోలీ మోతలకు చెక్ పెట్టాం
- అనంత సభలో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్



సూపర్ సిక్స్ విజయోత్సవ సభ సూపర్ సక్సెస్
దసరాకు ఆటో డ్రైవర్లకు
రూ.15వేల ఆర్థిక సాయం చేస్తామని
ప్రకటించిన సీఎం





## డిప్యూటీ సీఎం ఫొటో పెట్టొద్దని ఎక్కడుంది?

.. పిటిషనర్‌ను ప్రశ్నించిన ఏపీ హైకోర్టు

ప్రభుత్వ కార్యాలయాల్లో పవన్ ఫొటో ఏర్పాటుపై ఏ

హైకోర్టులో పిటిషన్

పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు ధర్మాసనం తీర్పు

వ్యాజ్యం వెనుక రాజకీయ దురుద్దేశం ఉందని అభిప్రాయం

కోర్టులను రాజకీయ వేదికలుగా మార్చవద్దని తీవ్ర వ్యాఖ్యలు

డిప్యూటీ సీఎం ఫొటో ఏర్పాటుపై నిషేధం లేదని స్పష్టీకరణ

2లో.

## ప్రభుత్వం బ్లాక్ మార్కెట్‌ను ప్రోత్సహిస్తోంది

చంద్రబాబు దేంట్లోనైనా దూకి చావాలి: జగన్

చంద్రబాబు నియోజకవర్గంలో కూడా రైతులు ఎరువుల కోసం బారులు తీరుతున్నారన్న జగన్

మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ధ్వజం

సెప్టెంబర్ 10 ఆంధ్ర ప్రగతి

రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న ఎరువుల కొరతపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పంలో కూడా రైతులు మిగతాది 2లో...



## 'ఎక్సర్‌సైజ్ జాపడ్'

భారత్-రష్యా సైనిక విన్యాసాలు

ట్రంప్ హెచ్చరికలు బేఖాతరు..



2లో.

రష్యాతో కలిసి సైనిక విన్యాసాలు ప్రారంభించిన భారత్

'ఎక్సర్‌సైజ్ జాపడ్' పేరుతో వారం రోజుల పాటు కసరత్తు

నిజ్నీ నగరంలో జరుగుతున్న సంయుక్త సైనిక విన్యాసాలు

## నేపాల్ లో తెలుగు వారికోసం లోకేష్ రాయబారం

నేపాల్‌లో ఆందోళనల కారణంగా చిక్కుకుపోయిన

241 మంది ఏపీ వాసులు

బాధితులతో వీడియో కాల్ లో మాట్లాడి ధైర్యం చెప్పిన మంత్రి లోకేశ్

అందరినీ క్షేమంగా రాష్ట్రానికి తీసుకొస్తామని లోకేశ్ హామీ

వెనక్కి రప్పించే ఏర్పాట్లపై అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష



2లో.

## రక్షణ శాఖ భూములివ్వండి

రాజ్ నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి

హైదరాబాద్‌లో ట్రాఫిక్‌కు చెక్

రాజీవ్ రహదారి విస్తరణకు 83 ఎకరాల

భూమి కేటాయించాలని కోరిన సీఎం

తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటు అంశంపైనా ప్రస్తావన

ఢిల్లీ, సెప్టెంబర్ 10 ఆంధ్ర ప్రగతి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులపై దృష్టి సారించారు. ఆయన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమై, మిగతాది 2లో...



## దేశవ్యాప్తంగా ఓటర్ జాబితా 'స్పెషల్ ఇంటెన్సివ్ సర్వే'

రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులతో సీఈసీ కీలక భేటీ

జాబితాల సమగ్రతను కాపాడటమే లక్ష్యంగా సవరణ

ఈసీ చర్యను సమర్థించిన సుప్రీంకోర్టు ధర్మాసనం



2లో.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



## డిప్యూటీ సీఎం ఫొటో పెట్టొద్దని ఎక్కడుంది?

### .. పిటిషనర్‌ను ప్రశ్నించిన ఏపీ హైకోర్టు

విజయవాడ, సెప్టెంబర్ 10 ఆంధ్ర ప్రగతి
ప్రభుత్వ కార్యాలయాల్లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోను ఏర్పాటు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) ఏపీ హైకోర్టు తోసిపుచ్చింది. ఈ పిటిషన్ రాజకీయ దురుద్దేశంతో వేసినట్లుగా ఉందని అభిప్రాయపడిన న్యాయస్థానం, దానిని కొట్టివేస్తున్నట్లు బుధవారం స్పష్టం చేసింది. డిప్యూటీ సీఎం ఫొటో పెట్టకూడదని చెప్పేందుకు చట్టపరమైన నిబంధనలు ఎక్కడ ఉన్నాయని ఈ సందర్భంగా ధర్మాసనం పిటిషనర్‌ను ప్రశ్నించింది.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఈ వ్యాజ్యంపై విచారణ చేపట్టింది. ప్రభుత్వ కార్యాలయాల్లో పవన్ కల్యాణ్ ఫొటో ప్రదర్శనకు చట్టబద్ధమైన అనుమతులు లేవని, దీనిపై ప్రభుత్వం ఒక స్పష్టమైన విధానం రూపొందించే వరకు ఆ ఫొటోలను తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని రైల్వే విశ్రాంత ఉద్యోగి వై. కొండలరావు ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఇందులో సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శితో పాటు, పవన్ కల్యాణ్‌ను కూడా వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా చేర్చారు.
విచారణ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నిజమైన ప్రజా ప్రయోజనాలు ఉన్న వ్యాజ్యాలను మాత్రమే న్యాయస్థానాలు పరిగణనలోకి తీసుకుంటాయని స్పష్టం చేసింది. రాజకీయ లక్ష్యాలను సాధించుకోవడానికి కోర్టులను ఒక వేదికగా మార్చుకోవడం సరైన పద్ధతి కాదని హితవు పలికింది. సమాజానికి మేలు చేసే అంశాలపై దృష్టి సారించాలని, అనవసర వ్యాజ్యాలతో కోర్టు సమయాన్ని వృథా చేయవద్దని సూచిస్తూ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

## ప్రభుత్వం బ్లాక్ మార్కెట్‌ను ప్రోత్సహిస్తోంది

(మొదటి పేజి తరువాయి)

ఎరువుల కోసం బారులు తీరడం సిగ్గుచేటని, ఈ అవమానం భరించలేక ఆయన దేంట్లోనైనా దూకి చావొచ్చు అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా? అనే సందేహం కలుగుతోందని విమర్శించారు.ప్రభుత్వం కావాలనే ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి, బ్లాక్ మార్కెట్‌ను ప్రోత్సహిస్తోందని జగన్ ఆరోపించారు. తమ ఐదేళ్ల పాలనలో ఎరువుల కోసం రైతులు రోడ్డెక్కిన పరిస్థితి ఎన్నడూ లేదని గుర్తు చేశారు. “గత రెండు నెలలుగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి సమస్యలపై పోరాడేందుకు మా పార్టీ ఆధ్వర్యంలో ‘అన్నదాత పోరు’ కార్యక్రమం నిర్వహించి ఆర్డీవోలకు వినతి పత్రాలు ఇస్తే, అర్ధరాత్రి పోలీసులు వచ్చి మా నేతలకు నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. రైతుల కోసం పోరాడటం తప్పా?” అని జగన్ ప్రభుత్వాన్ని నిలదీశారు.రాష్ట్రంలో పాలన ప్రజల కోసం కాకుండా దోపిడీదారుల కోసం సాగుతోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను ప్రైవేటు వ్యక్తుల దోపిడీకి అప్పగించేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దేశంతో పోలిస్తే తిరోగమనంలో ఉందని, ‘రెడ్ బుక్’ పాలనలో ప్రజలు తమ గొంతు విప్పే స్వేచ్ఛ కూడా కోల్పోయారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. కనీస బాధ్యతలను కూడా ప్రభుత్వం విస్మరించిందని ఆయన విమర్శించారు.

## రక్షణ శాఖ భూములివ్వండి

(మొదటి పేజి తరువాయి)

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అవసరమైన రక్షణ శాఖ భూములను రాష్ట్రానికి బదలాయించాలని కోరారు.మహానగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు స్కైవేలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం అత్యవసరమని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు. ముఖ్యంగా హైదరాబాద్-కరీంనగర్-రామగుండంలను కలిపే రాజీవ్ రహదారిపై ప్యాకేజీ జంక్షన్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి 83 ఎకరాల రక్షణ శాఖ భూమి అత్యవసరమని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఆ మార్గంలో ప్రయాణం సులభతరం అవుతుందని ఆయన పేర్కొన్నారు.అదేవిధంగా, నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఒకటైన మెహదీపట్నం రైతుబజార్ వద్ద పాదచారుల సౌకర్యార్థం స్కై వాక్ నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోందని, దీనికి కూడా కొంత రక్షణ భూమిని కేటాయించాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా నగర ప్రజల ట్రాఫిక్ కష్టాలు గణనీయంగా తగ్గుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ సమావేశంలో తెలంగాణలో కొత్తగా సైనిక్ స్కూల్ ఏర్పాటు చేసే అంశం కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి వెంట పలువురు తెలంగాణ ఎంపీలు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన ఈ ప్రాజెక్టులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తారని రాష్ట్ర ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

## నేపాల్ లో తెలుగు వారికోసం లోకేష్ రాయబారం

**నేపాల్‌లో ఆందోళనల కారణంగా చిక్కుకుపోయిన**

**241 మంది ఏపీ వాసులు**

**బాధితులతో వీడియో కాల్ లో మాట్లాడి ధైర్యం చెప్పిన మంత్రి లోకేశ్**

**అందరినీ క్షేమంగా రాష్ట్రానికి తీసుకొస్తామని లోకేశ్ హామీ**

**వెనక్కి రప్పించే ఏర్పాట్లపై అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష**



విజయవాడ, సెప్టెంబర్ 10 ఆంధ్ర ప్రగతి
నేపాల్‌లో జరుగుతున్న ఆందోళనల కారణంగా రాజధాని ఖాట్మండులో చిక్కుకుపోయిన మంగళగిరి వాసులతో రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ నేరుగా మాట్లాడారు. వీడియో కాల్ ద్వారా వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. నేపాల్‌లో మొత్తం 241 మంది ఏపీకి చెందిన యాత్రికులు చిక్కుకున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. వీరిని వీలైనంత త్వరగా సురక్షితంగా రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది.
మంగళగిరికి చెందిన మాచర్ల హేమసుందర్ రావు, దామర్ల నాగలక్ష్మి తదితర 8 మంది యాత్రికులు ప్రస్తుతం ఖాట్మండు ఎయిర్‌పోర్టుకు కిలోమీటరు దూరంలో ఉన్న పశుపతి ఫ్రంట్ హోటల్‌లో తలదాచుకుంటున్నారు. మంత్రి లోకేశ్‌తో వీడియో కాల్ లో మాట్లాడిన వారు తమ ఆవేదనను వ్యక్తపరిచారు. నిన్న తాము ప్రయాణిస్తున్న బస్సుపై ఆందోళనకారులు దాడి చేశారని, తీవ్ర భయాందోళనకు గురయ్యామని తెలిపారు. తమతో పాటు మరో 40 మంది తెలుగువారు కూడా అదే హోటల్‌లో ఉన్నట్లు వారు వివరించారు.
దీనిపై స్పందించిన మంత్రి లోకేశ్, ఎవరూ ఆందోళన చెందవద్దని, అందరినీ క్షేమంగా రాష్ట్రానికి తీసుకువచ్చే బాధ్యత తమదని భరోసా ఇచ్చారు. బాధితులతో నిరంతరం టచ్‌లో ఉండి, వారికి అవసరమైన సహాయాన్ని సమన్వయం చేసేందుకు రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల సంస్థ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావును నియమించినట్లు తెలిపారు. ఈ విషయంపై మంత్రి లోకేశ్ వెంటనే ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏపీ భవన్ అధికారి అర్జా శ్రీకాంత్‌తో పాటు సీనియర్ అధికారులు కార్తికేయ మిశ్రా, ముఖేశ్ కుమార్ మీనా, కోన శశిధర్, అజయ్ జైన్, హిమాన్షు శుక్లా, జయలక్ష్మి ఈ సమావేశంలో పాల్గొన్నారు. నేపాల్‌లో చిక్కుకున్న వారిని వెనక్కి రప్పించేందుకు భారత విదేశాంగ శాఖ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, సాధ్యమైనంత త్వరగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని లోకేశ్ అధికారులను ఆదేశించారు.

## ‘ఎక్సర్‌సైజ్ జాపడ్’ భారత్-రష్యా సైనిక విన్యాసాలు

ఢిల్లీ, సెప్టెంబర్ 10 ఆంధ్ర ప్రగతి
అంతర్జాతీయంగా అమెరికా నుంచి తీవ్ర ఒత్తిడి ఎదురవుతున్నప్పటికీ, భారత్ తన చిరకాల మిత్రుడు రష్యాతో స్నేహబంధాన్ని కొనసాగించేందుకే మొగ్గు చూపుతోంది. రష్యా నుంచి ఈరోజు ‘ఎక్సర్‌సైజ్ జాపడ్’ పేరుతో సంయుక్త సైనిక విన్యాసాలను ప్రారంభించాయి.రష్యాలోని నిజ్నీ నగరంలో ఉన్న ములినో ట్రైనింగ్ గ్రౌండ్‌లో ఈ విన్యాసాలు జరుగుతున్నాయి. సెప్టెంబర్ 10 నుంచి 16వ తేదీ వరకు వారం రోజుల పాటు ఈ కసరత్తు కొనసాగుతుంది. ఇందుకోసం 65 మంది సభ్యులతో కూడిన భారత సైనిక బృందం ఇప్పటికే రష్యా చేరుకుంది. ఉగ్రవాద నిరోధక చర్యలు, సంప్రదాయ యుద్ధ రీతుల్లో ఆధునిక వ్యూహాలను పరస్పరం పంచుకోవడం ఈ విన్యాసాల ముఖ్య ఉద్దేశమని భారత రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కసరత్తు వల్ల ఇరు దేశాల మధ్య రక్షణ సంబంధాలు మరింత బలపడటంతో పాటు, పరస్పర విశ్వాసం, సహకారం మెరుగుపడతాయని పేర్కొంది.రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తుండటంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర అసహనంతో ఉన్నారు. ఈ కారణంగానే భారత్‌పై ఆయన 50 శాతం సుంకాలను విధించారు. ఇటీవల జరిగిన ఎస్‌సీఓ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రత్యేకంగా సమావేశం కావడం ట్రంప్ ఆగ్రహాన్ని మరింత పెంచింది. ఈ క్రమంలో భారత్‌పై 100 శాతం సుంకాలు విధించాలని ఐరోపా దేశాలపై కూడా ఆయన ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.అయితే, ఈ అంతర్జాతీయ ఒత్తిళ్లను పట్టించుకోని భారత్, తన జాతీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తోంది. రష్యాతో మైత్రిని కొనసాగించాలనే తన నిబద్ధతను చాటుతూ తాజా సైనిక విన్యాసాలను చేపట్టినట్లు స్పష్టమవుతోంది.

## దేశవ్యాప్తంగా ఓటర్ జాబితా ‘స్పెషల్ ఇంటెన్సివ్ సర్వే’

ఢిల్లీ, సెప్టెంబర్ 10 ఆంధ్ర ప్రగతి
దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ సర్వే%-%ఎస్ఐఆర్) చేపట్టనున్నట్లు గతంలోనే ప్రకటించిన ఎన్నికల సంఘం.. తాజాగా ఈ విషయంపై రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులతో బుధవారం కీలక సమావేశం నిర్వహించనుంది. రాష్ట్ర ఎన్నికల సంఘాల ప్రధాన అధికారులతో దేశ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ మరికాసేపట్లో భేటీ కానున్నారు. బీహార్ లో ఇటీవల ఈ సర్వే చేపట్టి ఓటర్ జాబితాలో పెద్ద సంఖ్యలో అనర్హులను తొలగించిన విషయం తెలిసిందే. ఎన్నికల ముందు ఈ సర్వే చేపట్టడంపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేశాయి. దీనిపై అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే, ఈసీ చర్య రాజ్యాంగబద్ధమేనని ధర్మాసనం సమర్థించింది.రాష్ట్రాల ఎన్నికల సంఘం అధికారులతో జరగనున్న సమావేశంలో ఈసీ సీనియర్ అధికారులు ఎస్ఐఆర్‌పై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు సమాచారం. బీహార్ లో ఈ విధానాన్ని అమలు చేసిన తీరును ఆ రాష్ట్ర ఎన్నికల అధికారి వెల్లడించనున్నారు. అక్రమ వలసదారులను తొలగించడంతో పాటు ఓటరు జాబితాల సమగ్రతను కాపాడటమే లక్ష్యంగా ఈ చర్యలు ప్రారంభించినట్లు ఈసీ చెబుతోంది. వచ్చే ఏడాది తమిళనాడు, బెంగాల్, కేరళ, అస్సాం, పుదుచ్చేరిల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది చివర్లోనే దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తోంది.

# కూటమి పాలన సూపర్ హిట్








అనంతపురం, సెప్టెంబర్ 10 ఆంధ్ర ప్రగతి సంక్షేమం అంటే ఓట్ల రాజకీయం కాదు.. ప్రజల జీవన ప్రమాణం పెరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దసరా రోజున వాహన మిత్ర పథకం ప్రారంభించి.. ఒక్కో ఆటో డ్రైవర్‌కు రూ.15వేలు చొప్పున ఇస్తామని చంద్రబాబు తెలిపారు.’సూపర్ సిక్స్.. సూపర్ హిట్’ పేరిట కూటమి పార్టీల ఆధ్వర్యంలో అనంతపురంలో నిర్వహించిన బహిరంగసభలో సీఎం ప్రసంగించారు.
సూపర్ 6 హామీలు నెరవేర్చి మాట నిలబెట్టుకున్నాం. జవాబుదారీతనం, బాధ్యత కలిగిన ప్రభుత్వం మాది. ఎన్ని కష్టాలు ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం. 2024 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కూటమికి 95శాతానికి పైగా స్ట్రయిక్ రేట్ ఇచ్చి చరిత్ర తిరగరాశారు. తెలుగు తమ్ముళ్ల స్పీడు.. జనసేన జోరు.. కమలదళం ఉత్సాహానికి ఎదురుందా? నిర్వీర్యమైన వ్యవస్థను సరిదిద్ది పాలనను గాడిలో పెడుతున్నాం అన్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా ఇప్పటి వరకు 5 కోట్ల మంది ఉచితంగా బస్సులో ప్రయాణించారు. ఉచిత బస్సు పథకం జెట్ స్పీడ్‌లో దూసుకెళ్తోంది. ఎంతమంది పిల్లలుంటే అంత మందికి రూ.15వేలు ఇచ్చాం. తల్లికి వందనం అమలు చేసి తల్లుల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం అని గుర్తు చేశారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా కోట్ల మంది లబ్ధి పొందారు. రైతన్నకు అండగా ఉండేందుకు అన్నదాత సుఖీభవ తెచ్చాం. 47 లక్షల మంది రైతుల ఖాతాల్లో నగదు జమ చేశాం. దీపం-2 పథకం ద్వారా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ప్రతి ఇంట్లో వెలుగులు నింపాం కాబట్టే దీపం పథకం సూపర్ హిట్ అయింది. మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీ-చర్ ఉద్యోగాలు భర్తీ చేశాం అని చంద్రబాబు తెలిపారు. ఫేక్ రాజకీయాలతో మోసం చేయాలని వైకాపా చూస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. వైకాపా ఉనికి కోల్పోతోంది. పార్టీ ఆఫీసులు మూసుకొని.. సోషల్ మీడియా ఆఫీసులు తెరిచారు. ఎన్నికల సమయంలో సిద్ధం.. సిద్ధం అని ఎగిరిపడ్డారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని అంటున్నారు. రాజకీయాల్లో ఓనమాలు తెలియని వ్యక్తి.. ప్రతిపక్ష హోదా అడుగుతున్నారు. ప్రతిపక్ష హోదా ఇచ్చేది నేను కాదు.. ప్రజలు. అసెంబ్లీకి రాని వ్యక్తులు రాజకీయాలకు అర్హులా అని ప్రశ్నించారు. అసెంబ్లీకి రాకుండా.. రప్పా రప్పా అంటూ రంకెలేస్తున్నారు. రప్పా రప్పా అంటే చూస్తూ ఊరుకుంటామా?.. ఇక్కడ ఉన్నది సీబీఎన్. సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టిన 10 నిమిషాల్లో పోలీసులు వస్తారని హెచ్చరించారు. పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికల్లో వైకాపా బెండు తీశారు. సీమలో 52 సీట్లకు.. 45 సీట్లు- కూటమి ప్రభుత్వమే గెలిచింది. హింసారాజకీయాలు చేస్తే.. చట్టం ముందు నిలబెట్టే బాధ్యత నాది. వైకాపా అధినేతది ధృతరాష్ట్ర కౌగిలి.. ఆయనను నమ్మితే నాశనమే. అనంతపురం అభివృద్ధికి బ్లూప్రింట్ తయారు చేశాం. హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు కుప్పానికి తీసుకెళ్లాం. ఐదేళ్లలో వైకాపా చేయలేని పనిని.. 100 రోజుల్లో పూర్తి చేశాం. రాయలసీమ రాళ్ల సీమ కాదు.. రతనాల సీమ. రాయలసీమలో శాశ్వతంగా కరవు నివారిస్తాం. రాష్ట్రాభివృద్ధి కోసం నేను, పవన్ కల్యాణ్ అకుంఠిత దీక్షతో పనిచేస్తున్నాం. మా సంకల్పానికి నరేంద్రమోదీ అండగా ఉన్నారని చంద్రబాబు తెలిపారు. ప్రజల దీవెనలతో ఈ కాంబినేషన్ కొనసాగుతుందని అన్నారు. తెదేపా, జనసేన, భాజపా కార్యకర్తలు కాలర్ ఎగరేసుకొని తిరిగేలా పాలన అందిస్తున్నాం. ఏపీకి సహకరిస్తున్న ప్రధాని మోదీకి ధన్యవాదాలు. మనం పాలకులం కాదు.. సేవకులం. అవినీతి మన దరి చేరనీయకూడదు. మూడు పార్టీల కార్యకర్తల్లో ఐకమత్యం ఉండాలి. రాష్ట్రంలో హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీ- ఉండాలనేదే నా లక్ష్యం. అందరి క్షేమం కోసం పీ4 తీసుకొచ్చాం. నా చివరి శ్వాస ఉన్నంతవరకూ పేదల కోసమే పనిచేస్తా. కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం సూపర్‌హిట్. ఏపీని అన్నింటా సూపర్‌హిట్ చేద్దాం.. దేశంలోనే నంబర్‌వన్ చేద్దాం. ప్రజల దీవెనలతో ఈ కాంబినేషన్ కొనసాగుతుందని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టాక 3 పార్టీలు కలిసి నిర్వహిస్తున్న తొలిసభ కావడంతో కార్యకర్తలు భారీగా తరలించ్చారు. జనసేన అధినేత, డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, పలువురు కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు, మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సభకు హాజరయ్యారు.

### ఆర్థిక ఇబ్బందులున్నా సూపర్ సిక్స్ అమలు

ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా సూపర్‌సిక్స్ హామీలను అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అనంతపురంలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన ’సూపర్‌సిక్స్-సూపర్‌హిట్’ బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని చెప్పారు. ప్రతి కుటుంబానికి రూ.25లక్షల ఆరోగ్యబీమా కల్పించాం. ఒకే రోజు రికార్డుస్థాయిలో గ్రామసభలు నిర్వహించాం. కోటి మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టాం. శాంతి భద్రతలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాంఅని తెలిపారు. ఇచ్చిన హామీలకు
కట్టుబడి పనిచేస్తున్నామని అన్నారు. అనుభవజ్ఞుడైన సిఎం చంద్రబాబు నాయకత్వంలో ఎపి పురోగమి స్తోందని అన్నారు. ఆయన దార్శనికత రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకుని వెళుతోందన్నారు. ఇక ఏజెన్సీ ప్రాంతాల్లో డోలీ మోతలు ఉండవని హామీ ఇస్తున్నాం అన్నారు. శివతాండవాన్ని వినిపించిన నేల ఇది.. ఎందరో కవులు, కళాకారులు పుట్టిన నేల ఇది.. సీమకు ఎప్పుడూ కరువు కాలం, ఎండా కాలమే.. దీన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నాం అన్నారు.. రాయలసీమకు ఎప్పుడూ ఒకటే సీజన్ కరవు సీజన్ అన్న ఆయన.. పార్టీలు వేరైనా, ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సూపర్ సిక్స్ హామీలతో ఎన్నికల్లో ఘన విజయం సాధించాం అన్నారు.. రాష్ట్రంలో ప్రతీ వ్యక్తికీ 25 లక్షల రూపాయల ఆరోగ్య భీమా అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.. 4 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించామని పేర్కొన్నారు. 1,005 కోట్ల రూపాయలతో పీఎం జన్ మన్ పథకం ద్వారా 625 గిరిజన గ్రామాలను అనుసంధానించి రోడ్ల నిర్మాణం చేపడుతున్నాం.. ఇక ఏజెన్సీ ప్రాంతాల్లో డోలీ మోతలు ఉండవని హామీ ఇస్తున్నాం అన్నారు.. రాష్ట్రంలో పచ్చదనం పెంచేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నాం.. యువతకు విద్య, ఉపాధి అవకాశాలు దక్కేలా చేస్తున్నాం, ఎవరూ పొరుగు రాష్ట్రాలకు వెళ్లకుండా ఇక్కడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు చేశాం అన్నారు.. ప్రజా ప్రయోజనాల కోసం ఐక్యంగా కూటమి పార్టీలు కలిసి కొనసాగుతాయని స్పష్టం చేశారు.. రాయలసీమను రతనాల సీమగా మార్చి చూపిస్తాం.. ఏపీని నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. అనంతపురంలోని ఇందప్రస్థ మైదానంలో నిర్వహించనున్న ఈ సభకు హాజరయ్యేందుకు మూడు పార్టీల కార్యకర్తలు, నేతలు, ప్రజలు భారీగా తరలివచ్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి బస్సులు, కార్లు, ఇతర వాహనాల్లో అక్కడికి చేరుకున్నారు. దీంతో అనంతపురంలో సందడి వాతావరణం నెలకొంది. సభా ప్రాంగణాన్ని తెదేపా, జనసేన, భాజపా జెండాలతో తీర్చిదిద్దారు. ఈ సభకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ-సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఈ సమావేశంలో నేతలు వివరించారు. ’సూపర్ సిక్స్-సూపర్ హిట్’ నినాదాలతో సభా ప్రాంగణాన్ని కార్యకర్తలు హోరెత్తించారు.











# ప్లాస్టిక్ తయారుచేసే పరిశ్రమలు మూయించండి

## పరిశ్రమలకు అనుమతులు ఇవ్వదు. చిన్న వ్యాపారులపై గొడ్డలితో నరకొద్దు.

### పరిశ్రమలు బంద్ అయితే ..సమస్య ఉండదు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 10:**
ప్రభుత్వాలు పెద్ద,పెద్ద పరిశ్రమలకు అనుమతులు బందు చేస్తే ప్లాస్టిక్ తయారు ఉండదు.ప్లాస్టిక్ తయారుచేసే పరిశ్రమలు మూయిస్తే ఇబ్బందులు ఉండవు.ప్రభుత్వం,అధికారులు ప్లాస్టిక్ నివారణకు ఎన్ని చేసినా సమస్య పరిష్కారం కాకపోగా ప్రచారం,అవగాహనలు డబ్బు ఖర్చుతప్ప పలితం ఉండదు.పరిశ్రమల్లో తయారయ్యే ప్లాస్టిక్ కవర్లు హెూల్సేల్,రిటైల్ వ్యాపారులవద్దకు వస్తున్నాయి కాబట్టే వ్యాపారాలు చేస్తున్నారు.ప్రొడక్షన్ చేసేవారిపై చర్యలు తీసుకుంటే ఎక్కడా ఇబ్బందులు ఉండవు.పరిశ్రమలపై చర్యలు తీసుకోకుండా చిన్న వ్యాపారులను గొడ్డలితో నరికినట్టు వారిపై అధికారులు దాడులు చేయడం ఎంతవరకు సమంజసం.పర్యావరణ పరిరక్షణకు వ్యాపారులు సైతం సిద్ధమే అని చెప్పుకొస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు కొన్ని రోజులు హడావిడి చేసి షరా మామూలే అన్న చందంగా మారిపోతుంది.ప్రభుత్వం ఇటీవల ప్రతి ఇంటికి ప్లాస్టిక్ నిషేధం చర్యల్లో భాగంగా ఒక బ్యాగ్ ఇస్తామని చెప్పి ఒక రోజు కొన్ని బ్యాగులు పంచి ఫోటోలకు పోజులు ఇచ్చి మమా అనిపించుకున్నారు.ఇంటింటికి ఇస్తామని ప్రచారం చేసి ప్రచారాలకు పరిమితం అయ్యారు.ప్లాస్టిక్ నివారణ అధికారులు,వ్యాపారులతో నివారణ చేయడం అసాధ్యం.ప్రభుత్వం వాస్తవంగా ప్లాస్టిక్ నివారణ ఖచ్చితంగా చేయాలంటే పెద్ద పనేమి కాదు.ఎక్కడక్కడా ప్లాస్టిక్ తయారుచేసే పరిశ్రమలను కొంత గడువు ఇచ్చి తయారు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది.ఈ నేపథ్యంలోనే నంద్యాలలో చిన్న వ్యాపారులపై మున్సిపల్ అధికారులు విధి నిర్వహణలో భాగంగా దాడులు నిర్వహిస్తున్నారు. నంద్యాల రిటైల్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు అడ్డగాళ్ల మల్లికార్జున ఆధ్వర్యంలో ప్లాస్టిక్ విక్రయాలు చేసే వ్యాపారులతో కలిసి మున్సిపల్ కమిషనర్ శేషన్న ను కలిశారు.ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్లాస్టిక్ తయారు చేయకుండా నివారిస్తే మాకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు.పరిశ్రమలకు అనుమతులు ఇవ్వకుంటే తయారు కావు,మాకు సరుకు రవి చెప్పుకొచ్చారు.లక్షలు పెట్టీ సరకు తెచ్చిన మాకు కొద్దిరోజులు విక్రయించరాదని చెప్పే అధికారులు కొన్ని నెలలు తర్వాత ప్లాస్టిక్ కవర్లు కావాలని కోరుతున్నారు.పెద్ద,పెద్ద రాజకీయ నేతల సమావేశాల్లో లక్షల మంది ప్రజలు హాజరైతే ప్లాస్టిక్ వాడకుండా సమావేశాలు జరుగుతాయా అని ప్రశ్నించారు. ప్రజలు పాత కాలంలో మాదిరి సంచులు తెచ్చుకుంటే సరుకులు ఇవ్వడానికి ఇబ్బంది లేదన్నారు.ఫ్యాషన్ ప్రపంచంలో ఎవరు ఉన్నారని పరిష్కారమార్గం పరిశ్రమల్లో ప్లాస్టిక్ తయారు నివారణ ఒకటే మార్గం అన్నారు.చిన్న వ్యాపారులపై అధికారులు కనికరించాలని కోరారు. ప్రభుత్వం, అధికారులు పరిశ్రమలకు అనుమతులు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు.పై స్థాయిలో కట్టడి చేయాలని అన్నారు.

# ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ రైతు ఆత్మహత్యల నివారణ దినోత్సవం.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 10:** నంద్యాల పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాంతిరాం మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పిటల్ ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ ఓ సింధుజ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ప్రకృతి వైపరీత్యాలను ధైర్యంగా ఎదుర్కొని బ్రతకాలని వారన్నారు. రైతుల చిన్న బాధ వచ్చిన,కష్టం వచ్చినా భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నారని, భాదలు కష్టాలు తీరాలంటే ఆత్మహత్యలు మార్గం కాదని ధైర్యంగా నిలబడి మనల్ని నమ్ముకున్న కుటుంబం కోసం బ్రతకడమే సరైన మార్గమని వారు అన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతులు ఎలా వుంటారో కూడా తెలియజేశారు,ఆత్మహత్య చేసుకున్న రైతులకు మనం భరోసా ఇచ్చి ధైర్యాన్ని నింపాలని వారన్నారు.ఈ దేశానికి అన్నం పెట్టే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే చాలా బాధగా ఉందని వారన్నారు. నేను కూడా రైతు కుటుంబం నుంచే వచ్చాను రైతుల యొక్క బాధలు కష్టాలు ఎలా ఉంటాయో నాకు తెలుసు, కాబట్టి మానసికంగా రైతులు ఎవరైనా బాధలు పడుతుంటే వారు తక్షణమే మాలాంటి సైకియాట్రిస్ట్ డాక్టర్లను సంప్రదిస్తే ధైర్యాన్ని ఇస్తారని, వారు అన్నారు ఈ యొక్క కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పుల్లా నరసింహులు టి రామచంద్రుడు నరసింహ నాయక్ మార్పు సురేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే 50 మంది రైతులు కూడా పాల్గొనడం జరిగింది.

# గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి.

### - గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల జేసీ.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 10:**
గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక నంద్యాల జిల్లా ప్రభుత్వాన్ని కోరింది. బుధవారం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండల,మునిసిపాలిటీ లలో ఎంపిడిఓ మరియు మున్సిపల్ కమిషనర్లకు వినతిపత్రాలను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా నంద్యాల మునిసిపల్ కమిషనర్ గారికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు ఎం.గురుస్వామి, సుధాకర్,దేవనాల రామకృష్ణ మహేశ్వరి,వెంకటలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 1.25 లక్షల మంది గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల చెంతకు చేర్చడంలో నిబద్ధులై పనిచేస్తున్నారని,అదేవిధంగా నూతన ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ప్రతి కార్యక్రమం మరియు ప్రతి సర్వేల కొరకు ఇంటింటికి తిరిగి విధులు నిర్వహించడం వల్ల క్షేత్రస్థాయిలో అనేక తీవ్ర అవమానాలకు గురవుతూ,ఆత్మగౌరవానికి భంగం కలుగుతున్నప్పటికి విధులు నిర్వహిస్తున్నామని తెలియ జేశారు.

# పారిశ్రామికవేత్తలకు అనుమతులు వెంటనే జారీ చేయాలి.

### జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 10:**
సింగిల్ డెస్క్ విధానం ద్వారా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుండి అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు జారీ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ సంబంధిత అధికారులకు సూచించారు.

బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ సి .విష్ణు చరణ్ మాట్లాడుతూ... జిల్లాలో గత త్రైమాస కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ మొత్తం 1094 దరఖాస్తులు అందగా సింగల్ డిస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 1076 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశారని ఇంకా మిగిలిన 17 దరఖాస్తులను నిర్దిష్ట గడువులోపు తగిన పరిష్కారం అందించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో చిన్న మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కొరకు పెట్టుబడి రాయితీ పావలా వడ్డీ విద్యుత్తు సేల్ టాక్స్ తదితర రాయితీల కింద జిల్లాలో ఉత్పాదన సేవా రంగాల్లోని 20 యూనిట్లకు మొత్తం 350.48 లక్షల విలువైన రాయితీ ప్రయోజనాల జారీకి కమిటీ ఆమోదం తెలియజేసింది.

ఈ సమావేశం నందు సభ్యులకు నూతనంగా ప్రవేశపెట్టిన పారిశ్రామిక విధానముల ఆచరణ కొరకు విడుదల చేసిన విధి విధానాలను వివరించి నూతన పరిశ్రమల స్థాపనకు వారు సహకరించవలసిందిగా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ అభ్యర్థించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎస్ మహబూబ్ బాషా, ఎల్డీఎం రవీందర్ కుమార్, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిషోర్ రెడ్డి, రవాణా శాఖ అధికారి మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవర్ ఇంటర్వ్యూలు పూర్తి.

### -నంద్యాల జిల్లా రవాణా శాఖ అధికారి శివారెడ్డి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 10:** నంద్యాల జిల్లాకు సంబంధించి బుధవారం జిల్లా రవాణా అధికారి కార్యాలయం ఛాంబర్లో హెవీ మోటార్ వెహికల్ డ్రైవర్ పోస్టుల ఇంటర్వ్యూలు విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారి కే.తులసీదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఇంటర్వ్యూలను జిల్లా రవాణా అధికారి, నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్, డ్రైవింగ్ ఇన్స్ట్రక్టర్, ఆఫీస్ సూపరింటెండెంట్ (నంద్యాల డిపో), ఎస్సి కార్పొరేషన్ కర్నూలు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో కూడిన కమిటీ ఆధ్వర్యంలో పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు.మొత్తం 14 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 12 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. వారిలో 10 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో ఒక మహిళా అభ్యర్థి ఉన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ సీనియారిటీ మరియు వయస్సు ప్రమాణాల ఆధారంగా ఎంపిక జరిగిందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి శివశంకర్ రెడ్డి, ఆర్టీసీ డిఎం వినయ్ కుమార్, డ్రైవింగ్ స్కూల్ ఇన్స్ట్రక్టర్ ఏ సుధాకర్ ఎస్సీ కార్పొరేషన్ ఈవో ఎం విజయలక్ష్మి, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ ఎస్ యు వాల్ పోస్టర్లు విడుదల చేసిన శ్రీ సుధా కరస్పాండెంట్ వేణుగోపాల్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా సెప్టెంబర్ 10:**




నంద్యాల జిల్లా డోన్ లొ శ్రీ సుధా విద్యాసంస్థలో ఈరోజు ఆర్ ఎస్ యు10.వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లు విడుదల చేసిన వేణుగోపాల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుమల్ల శ్రీధర్ మాట్లాడుతూ విజయవాడలో జరగబోయే 10. రాష్ట్ర మహాసభలు ఈనెల 12, 13, 14 ఈ సభకు విద్యార్థులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఈ సభకు 200 మంది ప్రతినిధులతో కొనసాగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బి.ఆదినారాయణ జిల్లా కార్యదర్శి ఏ.కౌశిక్అశోక ఆర్ ఎస్ యు నాయకులు పాల్గొన్నారు.

# శిల్ప సేవా సమితి సేవలను రాజకీయంగా అడ్డుకోవడం సరికాదు

### - అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నా..! - మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 10:**
నంద్యాల నియోజకవర్గం లో కుటుంబం దశాబ్దానికి పైగా శిల్ప సేవా సమితి ద్వారా శిల్పా మినరల్ వాటర్, శిల్ప సహకార్ సూపర్ మార్కెట్, శిల్ప మహిళా సహకార బ్యాంక్ , శిల్పా స్కిల్ డెవలప్మెంట్ వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుండడం తెలిసిందే. ఐతే నాటి నుండి నేటి వరకు వివిధ పార్టీల ప్రభుత్వాలు అధికారం లో ఉన్నా శిల్పా సేవా సమితి కార్యక్రమాలను అడ్డుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి శిల్పా సేవా సమితి కార్యక్రమాలను నిలిపి వేయాలని, ఖాళీ చేయాలని ఒత్తిడి తెస్తూ కేవలం రాజకీయ దురుద్దేశంతో కక్ష సాధింపు చర్యలకు మంత్రి ఫరూక్ పాల్పడుతున్నారని, రాజకీయంగా శిల్పా సేవా సమితి కార్యక్రమాలను రాజకీయంగా అడ్డుకోవడం సరికాదని అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నాం అని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. శిల్పా మహిళా సహకర్ బ్యాంక్ ద్వారా 138 మంది పేదింటి అక్కా చెల్లెమ్మలకు 21లక్షల 84వేల రూపాయల విలువగల చెక్కులను ఆయన ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కిషోర్ రెడ్డి మాట్లాడుతూ...శిల్ప కుటుంబాన్ని రాజకీయంగా అడ్డుకోవాలని ఉంటే రాజకీయంగానే అడ్డుకోవాలి కానీ, శిల్పా సేవా సమితి ద్వారా ప్రజలకు చేస్తున్న నిస్వార్థపూరిత సేవలను అడ్డుకోవడం సరికాదని అది రాజకీయం కాదని, వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. నంద్యాల పట్టణంలో మంత్రి ఫరూక్ మాదిరి స్థలాలు ఆస్తులు లేవని, కాబట్టే ప్రభుత్వానికి సంబంధించిన మార్కెట్ యార్డ్ షాపింగ్ కాంప్లెక్స్ లలో ప్రభుత్వ నిబంధనలకు లోబడి బాడుగలు చెల్లిస్తూ సేవలను కొనసాగిస్తున్నామని తెలిపారు. అయితే గతంలో ఉన్న ప్రభుత్వాలు, నాటి ప్రజా ప్రతినిధులు తమ సేవలను ఎన్నడు అడ్డుకోలేదని, నేడు మంత్రి ఫరూక్ కక్షపూరితంగా రాజకీయ దురుద్దేశంతో శిల్పా సేవా సమితి ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాల అడ్డుకుంటున్నారని అన్నారు. ఇందులో భాగంగా ప్రథమ నందీశ్వర స్వామి దేవస్థానం ఆవరణంలో వైఎస్ఆర్ కళ్యాణమండపం ఖాళీ చేయించాలని, శిల్ప మహిళా సహకార బ్యాంక్, శిల్ప సహకార సూపర్ మార్కెట్ లను ఖాళీ చేయమని ప్రభుత్వం ద్వారా ఒత్తిడి తీసుకు వస్తున్నారని చెప్పారు. తాము ప్రజలకు సేవలు అందించడానికి మాత్రమే ఈ కార్యక్రమాలను చేస్తున్నామని, ఇందులో ఎటువంటి లాభాపేక్ష లేదని స్పష్టం చేశారు. దేవుని మరియు ప్రజల ఆశీర్వాదాలు శిల్పా కుటుంబం పై ఉన్నంతకాలం నంద్యాల ప్రజలకు తాము సేవలను అందిస్తామని తెలిపారు. నంద్యాల నియోజకవర్గ ప్రజలకు అందిస్తున్న ఈ సేవా కార్యక్రమాలను అడ్డుకొని నిలిపివేయడం ద్వారా శిల్ప కుటుంబానికి ఎటువంటి నష్టం రాదని, లేదని, కేవలం పేద ప్రజలకు మాత్రమే నష్టం వస్తుందని అన్నారు. మంత్రి ఫరూక్ చేతనైతే సేవా కార్యక్రమాలను తమ కంటే అనేక రెట్లు చేయాలని , తాము చేస్తున్న సేవలను అడ్డుకోవడం ఏ మాత్రం సమంజసం కాదని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ షాపింగ్ కాంప్లెక్స్ లు శిధిలావస్థలో , నిరుపయోగంగా ఉన్న వాటిని శిల్పా సేవా సమితి నిబంధనల మేరకు వాటికి బాడుగను చెల్లిస్తూ తమ సొంత నిధులతో ఆ కాంప్లెక్స్ లను మరమ్మతులు చేసి ప్రజలకు సేవలను అందిస్తున్నామని తెలిపారు. అలాగే శిల్పా మినరల్ వాటర్ ప్లాంట్లను నియోజకవర్గంలో దాదాపు 40 పైగా ఏర్పాటు చేసి ప్రజలకు సురక్షిత త్రాగునీటిని అందిస్తూ పేద ప్రజల ఆరోగ్యాన్ని రక్షిస్తున్నామని తెలిపారు. మహిళా సహకార బ్యాంకు ద్వారా పేద, నిరుపేద మహిళలకు ఆర్థిక భరోసాను కల్పిస్తూ వారి కాళ్లపై వాళ్లు నిలబడేటట్లు, కుటుంబానికి ఆసరాగా ఉండే విధంగా అతి తక్కువ వడ్డీరేట్లతో రుణాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శిల్ప మహిళా సహకార బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్ హరి లీల సిబ్బంది మహిళలు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించండి.

## జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 10:**
జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రణాళిక రూపొందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ డిస్టిక్ స్కిల్ డెవలప్మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ మాట్లాడుతూ.... జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఆసక్తి గల రంగాలలో నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధానంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాలలో ఉన్న నిరుద్యోగ యువతకు శిక్షణ కార్యక్రమాలను పెంపొందించి ఉపాధి కల్పించే దిశగా కోర్సులను గుర్తించాలన్నారు. జిల్లాలోని పెద్ద పెద్ద పరిశ్రమలను సంప్రదించి వారి అవసరాలకు అనుగుణంగా నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ ఇప్పించి వారికి ఉద్యోగ అవకాశాలను కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లాలో ఉన్నటువంటి స్కిల్ హబ్స్ మరియు జాబ్ మేళాల గురించి చర్చించటం జరిగింది. జిల్లాకు కేటాయించిన టార్గెట్స్ గడువులోపు పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, జీఎం ఇండస్ట్రియల్. ఐ టి డి ఏ ఏ పి ఓ, జిల్లా నైపుణ్యాభివృది సంస్థ అధికారి, సీడాప్ సీడ్ ఆప్ సిబ్బంది, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రవేత్తలను, స్వాతంత్ర్య సమరయోధులను అనుక్షణం స్మరించుకోవాలి.

## సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫీ.



**ఆంధ్ర ప్రగతి డోన్ సెప్టెంబర్ 10:** సెప్టెంబర్ 10 న రసాయన శాస్త్రవేత్త చర్మ పరిశోధనలలో విశేష కృషి చేసిన యలవర్తి నాయుడమ్మ జయంతి సందర్భంగా మరియు స్వాతంత్ర్య సమరయోధులు దండు నారాయణరాజు వర్ధంతి సందర్భంగా
డోన్ పట్టణం లో సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10 న రసాయన శాస్త్రవేత్త చర్మ పరిశోధనలలో విశేష కృషి చేసిన యలవర్తి నాయుడమ్మ జయంతి సందర్భంగా మరియు స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ దండు నారాయణరాజు గారి వర్ధంతి సందర్భంగా వారి చిత్ర పటాలకు పూలమాల వేసి ఘణంగా నివాళ్ళు అర్పించారు. వారిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూ..మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు. 1) డాక్టర్ శ్రీ యలవర్తి నాయుడమ్మ ప్రపంచ ప్రఖ్యాతి చెందిన రసాయన శాస్త్రవేత్త. చర్మ పరిశోధనలలో విశేష కృషి చేసిన మేధావి. గుంటూరు జిల్లా యలవర్రు గ్రామములో ఒక వ్యవసాయ కుటుంబములో సెప్టెంబరు 10, 1922 జన్మించాడు. కాశీ హిందూ విశ్వవిద్యాలయములో రసాయన టెక్నాలజిలో ఉన్నత విద్యనభ్యసించి మద్రాసు చర్మ టెక్నాలజీ సంస్థలో అంచలంచలుగా ఎదిగి డైరెక్టరు అయ్యాడు. తన ఆధ్వర్యములో చర్మపరిశోధనా సంస్థను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్ళాడు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో విశిష్టమ్మెన సేవలు అందించిన ప్రముఖ శాస్త్రవేత్తలకు నాయుడమ్మ అవార్డును ప్రదానం చేస్తారు. భారత ప్రభుత్వము నుండి పద్మశ్రీ పురస్కారము పొందాడు. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ శాస్త్ర సంస్థలలో సభ్యులుగా ఉన్నాడు. అమెరికాలోని చర్మ పరిశుభ్రం చేసే పరిశ్రమలో అఖండ పరిశోధనలు చేసి, అద్భుత విజయాలను సాధించారు. నాయుడమ్మ ఖనిజాలు, మొక్కలు, ఆల్డిహైడ్స్ మొదలైన వాటి కలయిక నిర్మాణ శైలి రంగాలలో కూడా విశేష పరిశోధనలు చేశారు. ఈయన పరిశోధనా కృషి ఫలితంగా మన దేశపు చర్మ తయారీ వస్తువులు అనేక వాటికి విదేశాలలో విశేషమైన ఆదరణ, గిరాకీ ఏర్పడ్డాయి. ఐరాస సలహాదారుగా పలు ఆఫ్రికా దేశాలలో తోళ్ళ పరిశ్రమ అభివృద్ధికి తోడ్పడిన నాయుడమ్మ శాస్త్ర సాంకేతిక రంగంలో ఉన్నత శిఖరాలను చేరుకుని దేశానికి, మరీ ముఖ్యంగా తెలుగు జాతికీ ఎనలేని ఖ్యాతిని తెచ్చిన మహనీయులు శ్రీ యలవర్తి నాయుడమ్మ గారు- జూన్ 23, 1985 స్వర్గస్తులైనారు. ఇలాంటి మహనీయులను స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు. 2) శ్రీ దండు నారాయణరాజు భీమవరం తాలూకా నేలపోగుల గ్రామంలో భగవాన్ రాజు, వెంకాయమ్మ దంపతులకు అక్టోబరు 15, 1889 న జన్మించారు. ఈయన నర్సాపురం తాలూకా పోడూరులో ప్రాథమిక విద్యను, తణుకు ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించి, విద్యారంగంలోను, క్రీడారంగంలోను ప్రతిభతో 1907 సంవత్సరంలో మెట్రిక్యులేషన్ పరీక్ష ఉత్తీర్ణులైయ్యారు. మద్రాసు ప్రెసిడెంషీ కళాశాలలో బి.ఎ పట్టా పొందారు. దండు నారాయణరాజు 1921లో న్యాయవాద వృత్తిని పరిత్యజించి మహాత్మాగాంధీ సహాయనిరాకరణ ఉద్యమంలో చేరారు. శ్రీ అల్లూరి సీతారామరాజు విప్లవం సందర్భంలో ప్రభుత్వంవారు నారాయణరాజుని కాకినాడలో అరెస్టు చేసి 17 రోజులు జైలులో ఉంచి తుదకు నిర్దోషి అని తెలుసుకొని విడుదల చేశారు. 1927 లో మద్రాసు శాసన సభకు పోటీ చేసి గెలిచారు. 1930 లో మహాత్మాగాంధీ గారి ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో పశ్చిమ గోదావరి జిల్లాకు నాయకుడై తన సహచరులతో ఏలూరు నుండి సముద్రతీరమున తూర్పుతాళ్ళు గ్రామం వరకూ నడచి ఉప్పుసత్యాగ్రహం చేశారు. అప్పుడే ఈయనకు సర్దార్ అను బిరుదు వచ్చింది. ఈ సందర్భంలో ప్రభుత్వం వీరిని ఒక సంవత్సరం పాటూ నిర్బంధంలో ఉంచింది. పశ్చిమ గోదావరి జిల్లాలో ఈయన ఖద్దరు వ్యాప్తికై విశేష ప్రచారం చేశారు. ఖద్దరు బోర్డుకు 1923 నుండి 1926 వరకూ అధ్యక్షులుగా వ్యవహరించారు. హరిజన, రైతు ఉద్యమాల్లో పాల్గొని వారి అభ్యుదయానికై పాటుపడ్డారు. సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంలో కూడా పాల్గొన్న వీరు తంజావూరు జైలులో సెప్టెంబర్ 10 -1944 న స్వర్గస్తులైయ్యారు. ఇలాంటి మహనీయులను స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి కోరారు.

# దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్లను ఘనంగా సన్మానించిన దూదేకుల సంఘం నాయకులు.



సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ జైనబి



దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఎన్నికైన విసీ కాలనీ దస్తగిరి, బనగానపల్లె బాబులను సన్మానిస్తున్న దూదేకుల సంఘం నాయకులు

**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 10:**
కూటమి ప్రభుత్వము వివిధ కార్పొరేషన్లలో డైరెక్టర్లను ప్రకటించిన విషయము అందరికీ తెలిసిందే అందులో భాగంగా దూదేకుల కార్పొరేషన్ కు నంద్యాల జిల్లా నుంచి దస్తగిరి (నంద్యాల), ఖాసీం బాబు (బనగానపల్లె) లను డైరెక్టర్లుగా ఎంపిక చేసిన శుభసందర్భంగా నంద్యాల జిల్లా/పట్టణ దూదేకుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగిందని జిల్లా అధ్యక్షుడు వాసవి దస్తగిరి, ప్రధాన కార్యదర్శి గోల్డ్ దస్తగిరి, కోశాధికారి హుస్సేనప్ప, పట్టణ అధ్యక్షుడు కంకర షేక్షావలి, ప్రధాన కార్యదర్శి ఆదాం సాహెబ్, కోశాధికారి సోమశేఖర్ లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పి బాబన్, రాష్ట్ర కోశాధికారి పర్ల దస్తగిరి, మాజీ కౌన్సిలర్ మిద్దె చిన్న ఉసేని ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా డాక్టర్ భాబన్ గారు మాట్లాడుతూ నిరుపేద దూదేకుల వారిని కార్పొరేషన్ ద్వారా ఆదుకోవాలని నూతన డైరెక్టర్ లకు సూచించారు. ఈ కార్యక్రమంలో గోస్పాడు మాజీ ఎంపీటీసీ హుస్సేన్ సాహెబ్, యూత్ నాయకులు గబ్బర్ దస్తగిరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలు , పోస్టల్ హాసన్, సీడ్స్ బాబు, అడ్వకేట్ బాబు, అడ్వకేట్ బాలాహాజీ, డిజిటల్ దస్తగిరి, టీచర్ దస్తగిరి మరియు నంద్యాల బనగానపల్లెకు చెందిన దూదేకుల నాయకులు పాల్గొన్నారు. నూతన డైరెక్టర్లుగా ఎన్నికైన బీసీ కాలనీ దస్తగిరి బనగానపల్లె బాబు మాట్లాడుతూ.. మంత్రులు ఎన్ఎండి ఫారుక్ బీసీ జనార్దన్ రెడ్డి సహకారంతో దూదేకుల కులంలో నిరుపేదల అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామని తమరిని డైరెక్టర్లుగా ఎంపిక చేసిన మరియు సత్కరించిన అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.



డైరెక్టర్గా ఎంపికైన దస్తగిరిని సన్మానిస్తున్న దృశ్యం



డైరెక్టర్గా ఎంపికైన బనగానపల్లె బాబుని సన్మానిస్తున్న దృశ్యం

# దేశ పురోగతికి ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ మార్గదర్శకత్వం కీలకం.

## -నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు శుభాకాంక్షలు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 10:**
ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ గారికి హార్థిక శుభాకాంక్షలు తెలియజేశారు నంద్యాల బిజెపి జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు. దేశ రాజకీయాలలో అత్యున్నత స్థానం గల ఉప రాష్ట్రపతి పదవికి రాధాకృష్ణన్ ఎన్నిక కావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అభిరుచి మధు మాట్లాడుతూ.. "రాధాకృష్ణన్ నాయకత్వంలో దేశం మరింత అభివృద్ధి సాధిస్తుంది. ప్రధాని నరేంద్ర మోడి దూరదృష్టి, ఆత్మనిర్భర భారత్ లక్ష్యం సాధనలో ఉప రాష్ట్రపతి గారు కీలక పాత్ర పోషిస్తారని నమ్ముతున్నాం. భారత దేశం అంతర్జాతీయ వేదికలపై మరింత గౌరవాన్ని సంపాదిస్తుంది" అని అన్నారు. అలాగే, ప్రజల ఆశయాలు, విలువలను ప్రతిబింబిస్తూ దేశంలో ప్రజాస్వామ్య పునాదులను బలపరిచే విధంగా సీపీ రాధాకృష్ణన్ కృషి చేస్తారని ఆకాంక్షించారు. "దేశంలో ప్రతి వర్గానికీ సమాన అవకాశాలు, అభివృద్ధి అందించే దిశగా ఉప రాష్ట్రపతి మార్గదర్శనం వెలకట్టలేనిది అవుతుంది" అని అభిరుచి మధు తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన, "బిజెపి కేంద్రమంత్రి వర్గం, రాష్ట్ర నాయకత్వం చూపిస్తున్న మార్గంలోనే ఉప రాష్ట్రపతి గారు కూడా దేశాన్ని కొత్త శిఖరాలకు చేర్చుతారు. దేశం సర్వాంగ సుందరంగా, ఆత్మనిర్భరంగా ఎదగాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.

# ఆటో డ్రైవర్లకు ఆర్థిక భరోసా.. వాహన మిత్ర పథకం.

## -మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి.



**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ సెప్టెంబర్ 10:** బోయి లగుంట్ల గ్రామం బుధవారం నాడు-అనంతపురంలో ఘనంగా జరిగిన సూపర్ సిక్స్ %-% సూపర్ హిట్ విజయోత్సవ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరో కీలకమైన పథకాన్ని ప్రకటించారు.
దసరా పండుగ కానుకగా రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కరికి -15,000 -ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజల మధ్య సీఎం చేసిన ఈ ప్రకటనతో ఆటో డ్రైవర్లలో విశేష ఆనందం వ్యక్తమైంది. ఈ పథకం వలన రాష్ట్ర వ్యాప్తంగా వేలాది ఆటో డ్రైవర్ల కుటుంబాలు లాభం పొందనున్నాయని అంచనాశిరివెళ్ళ మండల టిడిపి కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, "తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ పేదల కష్టాలు గుర్తించి, వారి అభ్యున్నతికి అండగా నిలుస్తుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం ఆటో డ్రైవర్లకు ఆర్థిక భరోసా కలిగిస్తుంది. సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రతి వర్గాన్నీ ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం ముందుకు సాగుతుంది" అని అన్నారు. అదేవిధంగా, ఈ సహాయం వలన ఆటో డ్రైవర్లు తమ కుటుంబ అవసరాలు తీర్చుకోవడంలో కొంత ఉపశమనం పొందుతారని, ఈ పథకం వలన వారికి కొత్త ఆశ కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

# నంద్యాలలో సేవామయంగా చిన్నారి పుట్టినరోజు వేడుక.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 10:**
నంద్యాల పట్టణానికి చెందిన అగ్నూరు లహరి %ఏ% అగ్నూరు కిరణ్ దంపతుల ముద్దుల ఏకైక కుమార్తె పర్ణిత 8వ పుట్టినరోజును విశిష్టంగా జరుపుకుంది. ఈ వేడుకను కేవలం కుటుంబానికి పరిమితం చేయకుండా, సమాజ సేవకు అంకితం చేయడం విశేషం. పుట్టినరోజు సందర్భంగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. వాటిలో భాగంగా నాగేంద్ర ఫాస్ట్ ఫుడ్ సెంటర్, శ్రీనివాస్ సర్కిల్ వద్ద నంద్యాల బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. అదేవిధంగా పరివర్తన లైఫ్ సెంటర్లో అన్నదానం, ఆవులకు దానం, ఉదయం యాచకులకు అల్పాహారం, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అల్పాహారం ఫ్రెండ్స్ ఫర్ సేవ సమితి ఆధ్వర్యంలో అందజేశారు. అలాగే రెండు పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు, రాత్రి రైల్వే స్టేషన్లో యాచకులకు అన్నదానం చేశారు. అదనంగా, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే యజ్ఞంలో భాగంగా గ్రీన్ సొసైటీకి స్టీల్ గ్లాసులు, ప్లేట్లు దానం చేశారు. ఈ కార్యక్రమాలు చూసినవారు లహరి, కిరణ్ దంపతులను హృదయపూర్వకంగా అభినందించారు. "పుట్టినరోజు కేక్ కటింగ్ కంటే ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం గొప్పది" అనే సందేశాన్ని ఈ దంపతులు సమాజానికి చాటి చెప్పారు. చిన్నారి పర్ణిత పుట్టినరోజు వేడుక కేవలం ఒక సంబరంగా కాకుండా, మానవత్వానికి పండుగగా నిలిచింది. చిన్న వేడుకలనైనా సేవామయంగా మార్చుకుంటే సమాజంలో మంచి మార్పులు వస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పుట్టినరోజు జరుపుకుంటున్న పర్ణిత కుటుంబ సభ్యులు, గ్రీన్ సొసైటీ అధ్యక్షులు దండు వెంకటేశ్వర్లు,నంద్యాల బ్లడ్ బ్యాంక్ ఇన్చార్జి అచ్చు, మదర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు డి. మురళి సభ్యుడు హుస్సేన్ వలి పాల్గొన్నారు.

# హాలో విద్యార్థి - ఛలో కడప.

## ఏ.ఐ.ఎస్.బి 9వ జాతీయ మహాసభలను జయప్రదం చేయండీ.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 10:**
2025 సెప్టెంబర్ 10వ తేదీ నంద్యాల ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహంలో ఏ.ఐ.ఎస్.బి జిల్లా అధ్యక్షులు తెలుగు మహేష్ అధ్యక్షతన జరిగిన గోడ ప్రతి విడుదల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పి,వి, సుందరరామరాజుఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి రామినేని రాజునాయుడు, అఖిల భారత యువజన లీగ్ ఏఐవైఎల్ రాష్ట్ర కన్వీనర్ టి.రవీంద్రనాథ్ , ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా అధ్యక్షులు వనం వెంకటాద్రి , ఏఐవైఎల్పాణ్యం డివిజన్ అధ్యక్షులు చంద్రశేఖర్ (చిరు)పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుందర రామరాజు మాట్లాడుతూ అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఏఐఎస్బి 9వ జాతీయ మహాసభలకు 19 రాష్ట్రాల నుండి350 మంది ప్రతినిధులు పాల్గొనున్నారు. ఆంధ్రప్రదేశ్ కడపలో 2025 సెప్టెంబర్ 12 విద్యార్థి ప్రదర్శన బహిరంగ సభ జరగనున్నాయి. సెప్టెంబర్ 13,14 తేదీలలో ప్రతినిధుల సభ జరగనున్నది, ఈ మహాసభలలో జాతీయస్థాయిలో విద్యా విధానంపై చర్చ జరగనున్నది,విద్య వైద్యం ప్రైవేటీకరణపైపలు తీర్మానాల రూపంలో కార్యచరణ రూపొందించడం జరుగుతుందని, జాతీయస్థాయిలో నూతన కమిటీ ఎన్నిక ఈ మహాసభల్లో జరగనున్నదని నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన అఖిల భారత విద్యార్థి బ్లాక్ జాతీయ మహాసభలు కడపలో జరుపుకోవడం , ఈ దేశ విద్యా విధానంపై కార్యచరణ రూపొందించడం కోసం జరిగే ఈ మహాసభల జయప్రదానికి మీ అందరి సహకారాన్ని కోరుతున్నాము అని అన్నారు.

## నంద్యాల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో
# పొలం పిలుస్తోంది కార్యక్రమం



**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ సెప్టెంబర్ 10:** నంద్యాల మండలం ఉడుమల్పురం మరియు పోలూరు గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి నంద్యాల వారు ప్రసాద్ రావు ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు పంటలలో నానో ఎరువుల ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించడం జరిగినది. నానో యూరియా మరియు నానో డి ఏ పి వాడకం వలన ఇందులోని పోషకాలు 80% పంటకు అందుతుందని, అలాగే వీటి పనితనం పంటలో ఎక్కువ కాలం ఉంటుందని, వీటి రవాణా ఖర్చు తక్కువని తెలిపారు. అలాగే నానో యూరియా మరియు నానో డి.ఏ.పి ఎరువుల వాడుక వలన పర్యావరణ మరియు భూమి కాలుష్యం తగ్గించి నాణ్యమైన దిగుబడులు పొందగలరని తెలియజేసారు.వరి ప్రధాన పంటలో ఎరువులను మోతాదుకు మించి వాడరాదని, ఎకరాకు 96 కిలోల నత్రజని, 32 కిలోల భాస్వరం మరియు 32 కిలోల పొటాష్ లను ఇచ్చే ఎరువులను వేసుకోవాలని తెలిపారు. అలాగే రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి పంటలు సాగు చేయాలని ఇందుకు గాను ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఆచరించి పంటలు సాగు చేయాలని, దీని వలన నాణ్యమైన దిగుబడులు పొందటమే కాకుండా, అధిక మార్కెట్ ధర పొందగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రవల్లిక, రైతు సేవా కేంద్రం సిబ్బంది సంజీవ్, పల్లవి మరియు రైతులు పాల్గొన్నారు.

# కళారాధన వక్తృత్వ పోటీలలో ప్రతిభ చూపిన బాలలు..!

మాతృభూమికి కళార్చనలో పదవరోజు పోటీలు.

తెలుగు, ఆంగ్ల భాష లలో జూనియర్ సీనియర్ విభాగాలలో ఉపన్యాస ప్రతిభ చూపిన 200 మంది విద్యార్థులు.

గురువారం 10 గంటలకు చిత్రలేఖనం,12 గంటలకు హిందీ వక్తృత్వ పోటీలు.




వక్తృత్వపు పోటీలో ఉపన్యాసం చేస్తున్న బాలిక




ప్రశంసా పత్రాలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు పోటీల నిర్ణేతలు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 10:**

కళారాధన నంద్యాల ఆధ్వర్యంలో, నంద్యాల ఐఎంఏ, లయన్స్ క్లబ్ సంయుక్త నిర్వహణలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ సృజనాత్మక సంస్కృతి సమితి సహకారంతో ఈనెల 1వ తేదీ నుండి నిర్వహిస్తున్న మాతృభూమికి కళార్చన పోటీలలో భాగంగా బుధవారం టౌన్ హాల్ ప్రాంగణంలో జూనియర్, సీనియర్ విభాగాలలో జరిగిన తెలుగు, ఆంగ్లం వక్తృత్వపు పోటీలలో బాలలు చక్కటి ఉపన్యాసాలు ఇచ్చి ప్రతిభ కనబరిచారు.

తెలుగులో"'విద్యార్థి దశలో చదువుతోపాటు కళలు,క్రీడల ప్రాధాన్యత "అంశంపై, ఆంగ్లంలో "కృత్రిమ మేధ ప్రయోజనాలు, దుష్పరిణామాలు"అన్న అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జూనియర్, సీనియర్ విభాగాలలో తెలుగు,ఆంగ్ల భాషలలో కలిపి 200 మంది పైగా విద్యార్థులు తమ వక్తృత్వపు ప్రతిభను చాటారు. ఎటువంటి వేదికా భయం లేకుండా,చక్కటి భాషలో,స్పష్టమైన ఉచ్చారణతో విద్యార్థులు చేసిన ప్రసంగాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కృష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, కోశాధికారి అమిదేల జనార్ధన్, సీనియర్ సభ్యులు మేడం చంద్రశేఖర్, కార్యాలయ కార్యదర్శి వెంకటేశ్వర్లు పోటీలను పర్యవేక్షించగా,తెలుగు వక్తృత్వ పోటీలకు నరేంద్ర,కమలాకర్,గోపాల కృష్ణ,నీలకంఠమాచారి, ఆంగ్ల భక్తులతో పోటీలకు అవ్వారు శేషఫణి,సుజాత,మంజుల,

చంద్రహాస్ రెడ్డి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఎన్టీఆర్ పురపాలక సెంటినరీ టౌన్ హాల్ ప్రాంగణంలో సేమ్ పది గంటలకు సామాజిక అంశాలపై చిత్రలేఖనం పోటీలు సబ్ జూనియర్ సీనియర్ విభాగాలలో ఉంటాయి.

12 గంటలకు హిందీలో జూనియర్, సీనియర్ విభాగాలలో "దేశ రక్షణలో సైనికుల త్యాగ నిరతి "అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహిస్తారు.

# పోలవరంతో రాయలసీమకు నీరిచ్చే ఛాన్స్

**అనంతపురం సభలో బిజెపి అధ్యక్షుడు మాధవ్ -జిఎస్టీ తగ్గింపులపై పట్టణంలో బిజెపి ర్యాలీ**





**అనంతపురం సెప్టెంబర్ 10 ఆంధ్ర ప్రగతి** టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఐక్యత ఇలాగే వర్ధిల్లుతుందని ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు.. అనంతపురంలో జరిగిన సూపర్ సిక్స్ -సూపర్ హిట్ సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించడానికి పెట్టిన పథకాలివి.. కేవలం సూపర్ సిక్స్ లే కాదు, చాలా సిక్స్ లు ఇప్పటికే కూటమి ప్రభుత్వం కొట్టిందన్నారు.. పోలవరం, అమరావతికి నిధులను కేంద్రం విడుదల చేసింది.. వేగంగా ఈ ప్రాజెక్టులు నిర్మితం అవుతున్నాయన్నారు.. రెండేళ్లలో పోలవరం ప్రాజెక్టు పూర్తై కృష్ణా బేసిన్ కు, రాయలసీమకు 215 టీ-ఎంసీల నీరు ఇచ్చేందుకు ఆస్కారం కలుగుతుందన్నారు.. త్వరలోనే ప్రజా రాజధాని అమరావతి పూర్తి అవుతుంది. స్టీల్ ఎ÷-లాంట్ కూడా మరింత ప్రగతి సాధిస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. డబుల్ ఇంజన్ సర్కారు హయాంలో ఏడాదిలో 9.70 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి.. 20 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు మాధవ్.. అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ఎ÷-లాంట్ వస్తోంది, అలాగే సెమీ కండక్టర్ యూనిట్ ను కూడా ఇటీ-వలే కేంద్రం కేటాయించింది.. లక్ష 30 వేల కోట్ల విలువైన 59 జాతీయ రహదారి ప్రాజెక్టులు ఏపీలో నిర్మితం అవుతాయి.. పోర్టులు, ఎయిర్ పోర్టులు, పర్యాటక ప్రాజెక్టులు పెద్ద ఎత్తున రాష్ట్రానికి వస్తున్నాయి.. రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపే వివిధ కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం చేపట్టిందని వెల్లడించారు.. ఇక, జీఎస్టీ తగ్గింపుతో వ్యవసాయదారులకు, మధ్యతరగతి ప్రజలకు, చిరు వ్యాపారులకు లబ్ధి కలగబోతోంది.. వెయ్యికి పైగా వస్తువుల ధరలు తగ్గి గేమ్‌ఛేంజర్‌గా మారబోతోందని వెల్లడించారు.. ఇక, స్వదేశీ వస్తువులు కొనుగోలు చేస్తే దేశం స్వయం సమృద్ధి సాధిస్తుంది..

ఆ లక్ష్యం దిశగా రాష్ట్రం కూడా ప్రయాణిస్తోందన్నారు మాధవ్.. సూపర్ సిక్స్- సూపర్ హిట్ ప్రతీ ఇంటికి వెలుగు ఇచ్చే పథకాలు. ఈ పథకాల విజయంతో డబుల్ ఇంజిన్ సర్కార్ సత్తాను చూపిందన్నారు.. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ధ్వంసం చేసింది. మాతృభాషను కూడా తీసేసే ప్రయత్నం చేసింది.. కూటమి రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తోంది. మాతృభాషను కొనసాగిస్తోందని పేర్కొన్నారు. అంతకుముందు జీఎస్టీ తగ్గింపులపై ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మంత్రి సత్యకుమార్‌తో కలసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మోడీ పాలనతో సామాన్యులకు ఊరట దక్కిందన్నారు.

------

# బిఆర్ నాయుడు రాకతో అన్నీ వివాదాలే

**టిటిడిలో సొంత ఉద్యోగుల పెత్తనం సాగుతోంది**

**వైఎస్సార్‌సీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి విమర్శలు**



తిరుపతి **సెప్టెంబర్ 10 ఆంధ్ర ప్రగతి** బీఆర్ నాయుడు టీటీడీ ఛైర్మన్ పదవి చేపట్టినప్పటి నుంచి అన్నీ వివాదాలే నెలకొంటున్నాయని.. తప్పులను ప్రశ్నిస్తే వ్యక్తిగత దాడులకు దిగుతున్నారని మాజీ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ నాయుడు ఛైర్మన్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అనునిత్యం ఏదో ఒకటి అపచారం జరుగుతున్నాయి. ప్రశ్నించి మాపై వ్యక్తిగత దాడికి దిగుతున్నారు. చంద్ర గ్రహణం రోజున మహాద్వారం మూసి వేసిన తర్వాత ఇత్తడి గ్రిల్ గేటు తాళాలు వేస్తున్నారు. బీఆర్ నాయుడు సైన్యంలో ఒకరు తాళం వేస్తున్నారు. ఇది దేనికి సంకేతం.ఇది చాలా తప్పిదం. బోర్డు సభ్యుడు మహాద్వారం వద్ద పెద్ద గొడవ జరిగింది.మీ సైన్యంలో ముఖ్యుడు శ్రీవారి ఆలయంలో కులశేఖర పడి వద్ద ఆలయ డిప్యూటి ఈవో పని చేస్తున్నాడనే ఫిర్యాదులందాయి. టీడీపీ కార్యకర్తగా టివీ5 ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. బీఆర్ నాయుడు ఉన్నారనే ధైర్యంతో ఈ బరితెగింపు బయటపడింది. ఆలయం లోపల మరోముఖ్యుడు చేస్తున్న విషయం బయటకు రాలేదు. శ్రీవారి కల్యాణాలు జరపాలని తెలుగు అసోసియేషన్ జర్మనీ వాళ్ళు తరపున రవి కుమార్ వేమూరి కోరారు. సెప్టెంబర్ ఆరు నుంచి 16 చోట్ల శ్రీవారి కల్యాణాలు జరపాలని కోరారు. బీఆర్ నాయుడు తన బలంతో ఒకే చేశారు..ప్రొసీడింగ్స్ ఇచ్చారు. శ్రీవారి కల్యాణాలు మొట్ట మొదటిగా మా హయంలో సూళ్లూరుపేట దళితవాడలో ప్రారంభించాం. ఆ తర్వాత దేశ వ్యాప్తంగా , ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్నాయి. శ్రీ శ్రీనివాస కల్యాణోత్సవాలు హాంబర్గ్‌లో కల్యాణోత్సవాలుకు టికెట్ ధర 116 యూరోలు , జంటగా కల్యాణోత్సవం 81 యూరోలు, విశేష కల్యాణానికి 515 యూరోలు పేరుతో టికెట్లు- పెట్టడం జరిగింది. ఎన్నికల ఫండ్స్ ఇచ్చిన వారికి సంపాదించుకోవడానికి అవకాశం ఇచ్చారా.. ధనవంతులు ఇళ్లలో లక్ష్మి పూజలు మీ అనుగ్రహంతోనే జరుగుతున్నాయి. మీరు చేసిన బ్లాక్ మెయిల్ చేసినవి ఒక్కొక్కటి బయటకు తీస్తున్నాం. మీరు చేస్తున్న అవినీతిపై మా పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## సూపర్ సిక్స్... సూపర్ ఫ్లాప్: షర్మిల



అమరావతి, **సెప్టెంబర్ 10 ఆంధ్ర ప్రగతి**

సూపర్ సిక్స్... సూపర్ ఫ్లాప్ అయిందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. బుధవారం ఎక్స్‌లో ఆమె స్పందించారు. ' సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటైనా పూర్తిగా అమలు చేశారా? రాష్ట్రంలోని 50 లక్షల మంది నిరుద్యోగుల్లో ఒక్కరికైనా రూ.3,000 చొప్పున ప్రతినెలా నిరుద్యోగ భృతి ఇస్తున్నారా? ఇస్తానన్న 20 లక్షల ఉద్యోగాలెక్కడ? స్థాపించని పరిశ్రమలతో అగ్రిమెంట్లు చేసుకున్నంత మాత్రాన ఉద్యోగాలు ఇచ్చేసినట్లేనా? ఒక్కరికీ భృతి ఇవ్వకుండా, ఉద్యోగం ఇవ్వకుండా సూపర్ సిక్స్ ఎలా సక్సెస్ అవుతుంది? కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలల్లో ఒక్క మహిళైనా నెలకు రూ.1,500 పొందారా? 14 నెలల తర్వాత ఫ్రీ బస్సును అమలు చేసి.. సూపర్ సక్సెస్ అంటే ప్రజలు నవ్వుతున్నారు. గోరంత చేసి కొండంత చెప్పుకోవడం నిజంగా కూటమి ప్రభుత్వానికే చెల్లుతుంది. ప్రతియేటా జనవరిలో జాబ్ క్యాలెండర్, విద్యుత్తు చార్జీలు తగ్గింపు, జర్నలిస్టులకు ఉచిత నివాస స్థలం లాంటి మ్యానిఫెస్టోలో పేర్కొన్న ప్రధాన హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా? ' అని షర్మిల ప్రశ్నించారు.

## వ్యవసాయ కూలీలపై పిడుగు ..
# ముగ్గురు దుర్మరణం

**%జోగులాంబ గద్వాల జిల్లాలో ఘటన**

**ముగ్గురు వ్యవసాయ కూలీలు మృతితో అయిజ మండలంలో విషాదశ్చాయలు**

**పిడుగుపాటుకు మరో నలుగురికి గాయాలు**

ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తున్న సమయంలో చెట్ల కింద తలదాచుకోవద్దని వాతావరణ శాఖ అధికారులు పదేపదే విజ్ఞప్తి చేస్తుంటారు. అయినా ఆ విషయంపై అవగాహన లేని ముగ్గురు వ్యవసాయ కూలీలు వర్షం పడుతున్న సమయంలో తాటి చెట్టు కింద తలదాచుకుని మృత్యువాత పడిన విషాదకర ఘటన తెలంగాణ రాష్ట్రం, గద్వాల జోగులాంబ జిల్లా, అయిజ



మండలంలో చోటుచేసుకుంది.

వివరాల్లోకి వెళితే.. భూంపూర్ గ్రామానికి చెందిన సర్వేశ్ (19), పార్వతి (40), పులికల్ గ్రామానికి చెందిన సౌభాగ్య (38) అక్కడి ఓ రైతు పొలంలో కూలీ పనులకు వెళ్లారు. నిన్న మధ్యాహ్నం సమయంలో వర్షం మొదలవడంతో వారు తాటి చెట్టు కింద తలదాచుకునేందుకు వెళ్లారు. అదే సమయంలో మిగిలిన నలుగురు - జ్యోతి, రాజు, కావ్య, తిమ్మప్ప - చెట్టుకు దూరంగా ఉండగా, ఒక్కసారిగా చెట్టుపై పిడుగు పడింది. పిడుగుపాటుతో చెట్టు కింద ఉన్న ముగ్గురు అక్కడికక్కడే మరణించగా, మిగిలిన నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి.

ఈ విషాద ఘటనతో అయిజ మండలం ఉలిక్కి పడింది. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రెవెన్యూ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి సంబంధిత నివేదికను సిద్ధం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుండి ఆర్థిక సాయం అందించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం

బుధవారం నాడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో భారీ వర్షాలతో జరిగిన నష్టం, ఇప్పటివరకు తీసుకున్న సహాయక చర్యలపై ఆయా శాఖల వారీగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, రాష్ట్ర ప్రకృతి విపత్తుల నిర్వహణా విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సుల్తానియాతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యల వల్ల చాలా వరకు ప్రాణ, ఆస్తి నష్టం తగ్గిందని అన్నారు. సహాయక పనులను మరింత వేగవంతం చేయాలని ఇప్పటివరకు పరిహారాలను విడుదల చేయకపోతే వాటిని వెంటనే విడుదల చేయాలని అధికారులకు సూచించారు. ఏ ఒక్క బాధితుడు పరిహారం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులు, కుంటలు, రోడ్ల మరమ్మతులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వర్షాలతో తీవ్రంగా దెబ్బతిన్న జిల్లాలకు రూ.10 కోట్లు–, సాధారణ నష్టం జరిగిన జిల్లాలకు రూ.5 కోట్లను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. సహాయక చర్యలను ఆయా జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకొని హైదరాబాద్ నుంచి ఆయా విభాగాధిపతులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వరద సహాయానికి సంబంధించి వినియోగించిన నిధులకు యూసీలను కేంద్రానికి అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సమావేశంలో మంత్రిగారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెల 13వ తేదీలోగా ఆయా విభాగాలు యూసీలను సమర్పించాలని ఆదేశించారు. అల్పపీడనం కారణంగా వచ్చే రెండు రోజులపాటు– పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్, పంచాయితీరాజ్, హెల్త్, మున్సిపల్, ఆర్బి ,విద్యుత్ తదతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నిజమైన జర్నలిస్టులకు మేలు జరిగేలా నిర్ణయాలు ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం నాడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, ఐఅండ్ పిఆర్ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, సీపీఆర్వో జి. మల్సూర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా అక్రిడిటేషన్ పాలసీ, జర్నలిస్ట్ ల హెల్త్ పాలసీ, జర్నలిస్టుల అవార్డులు, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి హైపవర్ కమిటీ– తదతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ అంశాలపై కార్మిక, ఆరోగ్య, హోం, ఆర్థికశాఖ అధికారులతో త్వరలో మరోసారి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.

# రాజీనామా ప్రసక్తే లేదు..

## ఏం చేసుకుంటారో చేసుకోండి: రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు

**సెప్టెంబర్ సెప్టెంబర్ 10 ఆంధ్ర ప్రగతి**
గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోమారు సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఎమ్మెల్యే పదవికి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీనామా చేయబోనని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరేమి చేసుకుంటారో చేసుకోండంటూ తీవ్రంగా స్పందించారు. తన రాజకీయ వైఖరిపై వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

తనను వరుసగా మూడుసార్లు గోషామహల్ నియోజకవర్గ ప్రజలే గెలిపించారని అన్నారు. రాష్ట్రస్థాయి బీజేపీ తనకు ఏ విధమైన మద్దతు ఇవ్వలేదని విమర్శించారు. ఎమ్మెల్యే పదవికి తాను రాజీనామా ఇచ్చే అవకాశమే లేదని తేల్చి చెప్పారు. తాను చెప్పిన మాటల్లో ఏమైనా తప్పు ఉందా అంటే బీజేపీ కార్యకర్తలను అడిగి తెలుసుకోవచ్చునని అన్నారు.

కొంతమంది పార్టీ పెద్దలకు భయపడి ఏమీ అనలేకపోతుండవచ్చునని రాజాసింగ్ అన్నారు. వారికి పదవి భయం ఉండవచ్చునని, కానీ తనకు ఎలాంటి పదవి ఆశ లేదని స్పష్టం చేశారు. తాను చేసే ప్రతి వ్యాఖ్య కార్యకర్తలకు మద్దతుగా ఉంటుందని అన్నారు.

తన వైఖరి భిన్నంగా ఉంటుందని రాజాసింగ్ స్పష్టం చేశారు. పార్టీ పెద్దలు ఎప్పుడు తప్పు చేసినా, తాను కచ్చితంగా ఎదురు తిరిగి ప్రశ్నిస్తానని ఆయన వెల్లడించారు. పార్టీ ప్రయోజనాల కంటే ప్రజల శ్రేయస్సే తనకు ముఖ్యమని, అందుకోసం ఎవరితోనైనా పోరాడతానని ఆయన పేర్కొన్నారు.

తనకు ఢిల్లీ పెద్దలు తరుచూ ఫోన్ చేసి మాట్లాడుతారని, తనకు అధిష్ఠానం పెద్దల ఆశీర్వాదం ఉందని ఆయన అన్నారు. వాళ్లను కలిసి పార్టీలో జరిగిందంతా చెబుతానని వ్యాఖ్యానించారు. తాను ఎప్పటికీ బీజేపీ నేతనేనని, కానీ సెక్యులర్ వాదిని మాత్రం కానని స్పష్టం చేశారు. తాను బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలలో చేరేది లేదని తేల్చి చెప్పారు.

# టిటిడి ఇవోగా సింఘాల్ బాధ్యతలు

## రంగనాయక మంటపంలో వేదాశీర్వచనం



తిరుమల " **సెప్టెంబర్ 10 ఆంధ్ర ప్రగతి**
టిటిడి ఈవోగా అనిల్‌కుమార్ సింఘాల్ బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఆయన అలిపిరి మార్గంలో కాలినడకన తిరుమల చేరుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో ఈవోగా ప్రమాణం చేశారు. రంగనాయకుల మండపంలో ఆయనకు వేద పండితులు ఆశీర్వచనాలిచ్చారు. అనిల్ సింఘాల్‌కు అదనపు ఈవో వెంకయ్య చౌదరి శేషవస్త్రం కప్పి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం అనిల్ కుమార్ సింఘాల్ మాట్లాడుతూ.. రెండోసారి ఈవోగా అవకాశం కల్పించినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. రెండోసారి అవకాశం రావడం పూర్వజన్మ సుకృతం అని పేర్కొన్నారు. కాలినడక మార్గంలో వస్తున్నప్పుడు భక్తులు కొన్ని సమస్యలు దృష్టికి తెచ్చారని తెలిపారు. వాటిని పరిష్కరించి మెరుగైన సేవలందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. తిరుమల పవిత్రతను కాపాడాలని సిఎం చంద్రబాబు నాయుడు తనకు సూచించారన్నారు. సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారని తెలిపారు. ఆయన సూచనల మేరకు తన సేవలను విస్తృతం చేస్తానని, సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇస్తానని అన్నారు. ఇదిలావుంటేబదిలీ అయిన ఈవో శ్యామలరావుకు ఆలయ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా శ్యామలరావు మాట్లాడుతూ.. పూర్వ జన్మ సుకృతం ఉంటే తప్ప తితిదే ఈవోగా పనిచేసే భాగ్యం కలగదన్నారు. తనకు ఈవోగా పనిచేసే అవకాశం ఇచ్చిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. 14 నెలల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చినట్లు– చెప్పారు. రాబోయే 25 సంవత్సరాల అవసరాలకు అనుగుణంగా సంస్కరణలు, అభివృద్ధి చేపట్టినట్లు– వివరించారు. బోర్డు సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

# నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసులకు అండ

## తెలంగాణ భవన్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు

హైదరాబాద **సెప్టెంబర్ 10 ఆంధ్ర ప్రగతి**నేపాల్‌లో అల్లర్లు, రాజకీయ అస్థిరత నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం అక్కడి పౌరులకు అండగా నిలిచింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఒక ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ పౌరులకు, వారి కుటుంబ సభ్యులకు సహాయం అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతానికి, ఏ తెలంగాణ పౌరుడికి గానీ గాయాలు లేదా అదృశ్యమైనట్లు ఎలాంటి నివేదికలు అందలేదు.అయినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ, అలాగే కాఠ్మండులోని భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ, అక్కడ ఉన్న తమ పౌరుల భద్రతను, అలాగే వారిని సురక్షితంగా వెనక్కి రప్పించే ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది.సహాయం కోసం తెలంగాణ పౌరులు ఈ క్రింది అధికారులను సంప్రదించవచ్చునిసూచించింది. ప్రైవేట్ సెక్రటరీ, రెసిడెంట్ కమిషనర్ లైజన్ హెడ్ వందన. ఫోన్: 91 9871999044. లైజన్ ఆఫీసర్ జి. రక్షిత్ నాయక్ ఫోన్: 91 9643723157.పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సిహెచ్. చక్రవర్తి.. ఫోన్: 91 9949351270. పౌరులందరూ అధికారిక ప్రకటనలను మాత్రమే అనుసరించాలని, ధృవీకరించని సమాచారాన్ని నమ్మవద్దని, ఇతరులకు పంపవద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో తన ప్రజల భద్రత, సంక్షేమం పట్ల తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతతో ఉందని ఈ సందర్భంగా పేర్కొంది.

-------

# నందమూరి బాలకృష్ణకు అనారోగ్యం



**'సూపర్ సిక్స్... సూపర్ హిట్' కార్యక్రమానికి హాజరుకాని బాలకృష్ణ**

**అనారోగ్యం కారణంగా బాలయ్య రాలేదని వెల్లడించిన పయ్యావుల కేశవ్**

ప్రముఖ సినీ నటుడు, హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయాన్ని ఏపీ మంత్రి పయ్యవుల కేశవ్ వెల్లడించారు. అనంతపురంలో కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న 'సూపర్ సిక్స్... సూపర్ హిట్' సభలో పయ్యావులు మాట్లాడుతూ... ఈ సభకు నారా లోకేశ్, బాలకృష్ణ ఇద్దరూ హాజరుకావాల్సి ఉందని ఆయన చెప్పారు. అనారోగ్యం కారణంగా బాలయ్య ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోయారని తెలిపారు. అయితే, బాలయ్యకు ఏమైంది? అనే విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. మరోవైపు, నేపాల్ లో చిక్కుకుపోయిన తెలుగువారిని సురక్షితంగా రప్పించే పనుల్లో లోకేశ్ నిమగ్నమై ఉన్నారని... సచివాలయం నుంచి నేపాల్ లోని పరిస్థితిని ఆయన మానిటర్ చేస్తున్నారని తెలిపారు. ఈ కారణంగా ఈ కార్యక్రమానికి లోకేశ్ హాజరుకాలేకపోయారని చెప్పారు.

# బంగారం ధరలు మరింత పైపైకి



న్యూఢిల్లీ, **సెప్టెంబర్ 10 ఆంధ్ర ప్రగతి**
:బంగారం కొనాలనుకునే వారికి వరుసగా షాక్ తగులుతోంది. బంగారం ధర ఆల్–టైమ్ గరిష్టానికి చేరింది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 10, 300కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 01, 100కి చేరింది ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు– 10 గ్రాములకు రూ. 1, 10, 450కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 01, 260కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 10, 300కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు– రూ. 1, 01, 100కి చేరింది. వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే కేజీకి వంద రూపాయల మేర పెరిగాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లలో స్వల్ప మార్పులు ఉన్నా పెద్దగా తేడాలేదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

-------

# పయ్యావుల కృషి సూపర్ 'సక్సెస్'

**సెప్టెంబర్ 10 ఆంధ్ర ప్రగతి** అనంతపురంలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన %–%సూపర్ సిక్స్–సూపర్ హిట్%–% భారీ బహిరంగ సభ బాధ్యతలను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, ఇదే జిల్లాకు చెందిన ఉరవకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ భుజాన వేసుకున్నారు. వాస్తవానికి ఈ సభను విజయవంతం చేసేందుకు సీఎం చంద్రబాబు 10 మందితో కూడిన మంత్రుల కమిటీని నియమించారు. దీనిలో పయ్యావుల తొలుత సభ్యుడు మాత్రమే. కానీ, ఆయన ఆసక్తిని గమనించిన సీఎం చంద్రబాబు.. తర్వాత రెండు రోజుల్లోనే సభ నిర్వహణ పూర్తి బాధ్యతను ఆయనకే అప్పగించారు. దీంతో అప్పటి నుంచి పయ్యావుల సభా వేదిక వద్దే చిన్న టెంటును ఏర్పాటు చేసుకునిగత ఐదు రోజు లుగా అక్కడే ఉంటూ.. సభ డిజైన్ నుంచి కార్యక్రమాల నిర్వహణ వరకు అన్నీ తానై ఏర్పాట్లను పర్యవే క్షించారు. వేదిక ఏర్పాటు నుంచి సభలో ఎవరెవరు ప్రసంగించాలనే విషయంపై ఆయన కసరత్తు చేసు కుని.. దాని ప్రకారం సభను నిర్వహించారు. సభకు సుమారు 3.5 లక్షల మంది వస్తారని ముందుగా అంచనా వేసుకున్నప్పటికీ.. తర్వాత పెరిగిన అంచనాలతో సుమారు 5 లక్షల మంది వరకు హాజరైనా.. దానికి తగిన విధంగా ఏర్పాట్లు చేశారు., %యాశ్రీంశీ =ఝు%  – జగన్ ప్రతిపక్ష హోదా... బాబు కూడా తేల్చేశారుగా ! అదేసమయంలో ఎక్కడా ఇబ్బంది లేకుండా.. సభను సంపూర్ణంగా విజయవంతం చేసేలా .. వ్యూహాత్మకంగా వ్యవహరించారు. సభలో అధ్యక్ష బాధ్యతలను కూడా పయ్యావుల తీసుకున్నారు. ఎక్కడెక్కడ ఎవరు ఏ కార్యక్రమాలు నిర్వహించాలి? సభలో ముందు ఎవరు ప్రసంగించాలి? తర్వాత ఎవరు ప్రసంగించాలనే అంశాలను కూడా డైరీ రాసుకుని.. దాని ప్రకారం పక్కా ప్రణాళికతో ముందుకు తీసుకువెళ్లారు. అదేసమయంలో తాగునీరు, ఆహారం కూడా ఏర్పాటు చేశారు. తొలుత ఆహారం వద్దనుకున్నా.. పయ్యావుల జోక్యం చేసుకుని.. ఆహార పొట్లాలను కూడా దాతల నుంచి స్వీకరించే ఏర్పాటు చేశారు. ఇక, సభకు స్వచ్ఛందంగా వచ్చే కార్యకర్తల కోసం.. పార్టీ తరఫున బస్సులు ఏర్పాటు చేశారు. ఎక్కడా తొక్కిసలాటకు అవకాశం లేకుండా.. 500 మందికి ఒక గ్యాలరీ చొప్పున ఏర్పాటు చేశారు. గ్యాలరీకి.. గ్యాలరీ కి మధ్య గ్యాప్ ఉండేలా చూసుకున్నారు. వలంటీర్లను



వందల సంఖ్యలో మోహరించారు. అసౌకర్యానికి అవకాశం లేకుండా.. ఎవరూ ఇబ్బంది పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రతి విషయాన్ని చాలా నిశితంగా తీసుకున్నారు. ప్రధానంగా సీమలో నిర్వహించిన రెండో అతి పెద్ద సభ కావడంతో(గతంలో మహానాడు నిర్వహించారు– కడపలో) దీనిని పయ్యావుల పూర్తి బాధ్యతాయుతంగా వ్యవహరించి సక్సెస్ చేశారనే టాక్ వినిపిస్తోంది.





# కేంద్రంతో కుమ్మక్కు వల్లే యూరియా కష్టాలు

## ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

విజయవాడ **సెప్టెంబర్ 10 ఆంధ్ర ప్రగతి** రాయితీ డబ్బులకు ఆశపడి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం వల్ల రైతులకు యూరియా కష్టాలు ఎదురయ్యాయని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు రైతులకు వివరించారు. బుధవారంచల్లపల్లి మండల పరిధిలోని లక్ష్మీపురం, మేకవారిపాలెం పిఎసిఎస్ లను చల్లపల్లి మండలం సిఐటియు కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు బండారు కోటేశ్వరావుతో కలిసి సందర్శించి యూరియా పంపిణీ విధానంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రానికి నలభై లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగ పది హేను లక్షల మెట్రిక్ టన్నుల యూరియా వాడకం తగ్గించి, ఆ రాయితి డబ్బులు తీసుకునేందుకు ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. సొసైటీలలో యూరియా పంపిణీ చేస్తారని సమాచారం అందుకున్న రైతులు కౌలు రైతులు ఉదయాన్నే సొసైటీల వద్దకు చేరి యూరియా కోసం పడిగాపులు కాశారు. ఎకరానికి అరకట్ట యూరియా ఇస్తామని అధికారులు ప్రకటించటంతో విదాసి చెందిన రైతులు వాగ్వివాదానికి దిగారు. గతంలో ఇచ్చిన వారికి కాకుండా ఈరోజు చిన్న సన్నకారు రైతులకు యూరియా పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. ఒకటి– రెండు రోజుల్లో యూరియా లోడు వస్తుందని మిగిలిన రైతులందరికీ సర్దుబాటు– చేస్తానని చెప్పటంతో రైతులు సద్దుమణి మండల వ్యవసాయాధికారి కె.మురళి కృష్ణ, చైర్ పర్సన్ లంక బాబు, సీఈవో రమేష్ బాబు లంకపల్లి యూరియా పంపిణీ చేయగా, చల్లపల్లి ఎస్ ఐ పి వి ఎస్ సుబ్రహ్మణ్యం సిబ్బందితో పర్యవేక్షించారు.

# బీసీసీఐకి ఉత్తరాఖండ్ హైకోర్టు నోటీసులు



ఉత్తరాఖండ్ హైకోర్టు బీసీసీఐకి మంగళవారం నోటీసులిచ్చింది. ఆ రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.12 కోట్లను క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఉత్తరాఖండ్ దుర్వినియోగం చేసిందనే ఆరోపణలపై దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్లపై స్పందించిన హైకోర్టు బీసీసీఐకి నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ ఆఫ్ ఉత్తరాఖండ్ ఆడిట్ రిపోర్ట్ ఆధారంగా ఆటగాళ్లకు అరటిపండ్ల కోసం రూ.35 లక్షలకు ఖర్చు చేశారని పిటిషనర్ ఆరోపించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఉత్తరాఖండ్ ఆకౌంట్స్‌పై దర్యాప్తు కోరుతూ డెహ్రాడున్‌కు చెందిన సంజయ్ రావత్ సహా మరికొందరు హైకోర్టులో పిటిషన్ వేశారు. పిటిషనర్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఉత్తరాఖండ్ ఆడిట్ రిపోర్ట్‌ను హైలైట్ చేస్తూ, అందులో ఖర్చులు చూసి షాక్‌కు గురైనట్లు పేర్కొన్నారు. కేవలం ప్లేయర్లకు అరటిపండ్లు అందించేందుకే రూ.35 లక్షలు ఖర్చైనట్లు ఆడిట్ రిపోర్ట్‌లో ఉన్నట్లు తెలిపారు. అందుకే ఆ రాష్ట్ర క్రికెట్ బోర్డు ఆడిట్ రిపోర్ట్‌పై దర్యాప్తు చేపట్టాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. క్రికెట్ డెవలప్‌మెంట్ కోసం కేటాయించిన ఆ నిధులను, కొందరు వ్యక్తిగత బెనిఫిట్ కోసం దుర్వినియోగం చేశారని అన్నారు. ఆహార ఖర్చుల ముసుగులో అసోసియేషన్ కోట్లు స్వాహా చేసిందని, రాష్ట్ర ఆటగాళ్లకు తగిన సౌకర్యాలు ఎప్పుడూ కల్పించలేదని పిటిషనర్లు ఆరోపించారు. కాగా, సింగిల్ బెంచ్ జస్టిస్ మనోజ్ తివారి ఈ పిటిషన్లపై వాదనలు విన్నారు. ఇక ఈ ఆరోపణలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. రాష్ట్ర క్రికెట్ బోర్డు నిర్వహించే టోర్నమెంట్‌లకు కూడా బోర్డు భారీగా ఖర్చు చేసిందని ఆరోపించారు. ఆడిట్ రిపోర్ట్ ఆధారంగా, రూ.6.4 కోట్లు ఈవెంట్ మేనేజ్‌మెంట్ ఫీజులు, రూ.26.3 కోట్లు టోర్నమెంట్ల నిర్వహణ, ట్రైయల్ మ్యాచ్‌లు ఇతరత్రా అవసరాలకు ఖర్చు అయ్యింది. అయితే గతేడాది ఈ ఖర్చు రూ. 22.30 కోట్లే ఉంది. కాగా, ఇదే నెల 5న బోర్డుకు సంబంధించి మరో పిటిషన్ హైకోర్టుకు ముందుకు వచ్చింది. 2025 సీజన్‌కు సంబంధించి ఉత్తరాఖండ్ ప్రీమియర్ లీగ్‌లో టెండర్ల వ్యవహారంపైనా కోర్టులో వాదనలు జరిగాయి. టెండర్ల ప్రక్రియ సరైన విధానంలో జరగడం లేదని, కావాలని ఒకే కంపెనీకి టెండర్లు దక్కేలా చేస్తున్నారని క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఉత్తరాఖండ్ ఉపాధ్యక్షుడు సురేంద్ర బండారి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై స్పందించిన హైకోర్టు దీనిపై తమ సమాధానం తెలపాలని జస్టిస్ నరేందర్, జస్టిస్ సుభాష్ బెంచ్ బీసీసీఐ, క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఉత్తరాఖండ్ బోర్డు అధికారులకు నోటీసులు పంపించింది. అలాగే 2019లోనే క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఉత్తరాఖండ్‌కు బీసీసీఐ గుర్తింపు లభించిందని, అప్పట్నుంచి రాష్ట్ర బోర్డుకు జాతీయ క్రికెట్ అసోసియేషన్ నుంచి రూ.22 కోట్లకు పైగా నిధులు వచ్చాయని ఉపాధ్యక్షుడు సురేంద్ర బండారి పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే ఆ నిధులను కొందరు అధికారులు తమ స్వార్థం కోసం పక్కదారి పట్టించారని ఆరోపించారు. అంతేకాకుండా అధికారులు అసోసియేషన్‌లో ఎలాంటి అభివృద్ధి చేయరని, ప్లేయర్లకు సరైన సౌకర్యాలు కల్పించరని అన్నారు. అందుకు బదులుగా ప్లేయర్లకు కేవలం నీళ్లు, అరటిపండ్లనే ఇస్తారని తెలిపారు.

# అహ్మదాబాద్‌లో ఫైనల్

## టీ20 ప్రపంచకప్ 2026 తేదీలు ఖరారు..!

## ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు మ్యాచ్‌లు

భారత్, శ్రీలంక వేదికగా వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ జరగనున్న విషయం తెలిసిందే. అయితే ఈ టోర్నీకి సంబంధించిన షెడ్యూల్‌ను ఐసీసీ ఖరారు చేసినట్లు సమాచారం. ఈ మేరకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టోర్నీ జరగనున్నట్లు తెలుస్తోంది. దీన్ని బట్టి చూస్తే.. ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే.. ఈ పొట్టి ప్రపంచకప్ జరగనుంది! ఈ మెగా ఈవెంట్‌లో మొత్తం 20 జట్లు పాల్గొంటాయి. ఈ ఈవెంట్‌లోని మ్యాచ్‌లు శ్రీలంకతో పాటు.. భారత్‌లో జరగనున్నాయి. ఫైనల్ మ్యాచ్ గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరగనున్నట్లు సమాచారం. ఒకవేళ పాకిస్థాన్ ఫైనల్ చేరితే.. శ్రీలంకలోని కొలంబోలో మ్యాచ్ జరుగుతుంది. టీ20 ప్రపంచకప్ 2026లో మొత్తం 20 జట్లు పాల్గొంటాయి. అందులో ఇప్పటికే 15 టీమ్స్ ఖరారు అయ్యాయి. అవి భారత్, శ్రీలంక, అఫ్ఘానిస్థఆన్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, యూఎస్ఏ, వెస్టిండీస్, న్యూజిలాండ్, పాకిస్థాన్, ఐర్లాండ్, కెనడా, నెదర్లాండ్స్, ఇటలీ. మిగిలిన ఐదు జట్లు ఆఫ్రికన్, ఆసియా, తూర్పు ఆసియా పసిఫిక్ క్వాలిఫయర్స్ నుంచి అర్హత సాధించనున్నాయి. 20 జట్లను మొత్తంగా నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. అందులో భాగంగా ప్రతి గ్రూప్‌లో ఐదేసి జట్ల చొప్పున ఉంటాయి. లీగ్ స్టేజ్‌లో ప్రతీ జట్టు 4 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. లీగ్ దశ ముగిసే సరికి.. ప్రతి గ్రూపులో టాప్-2లో నిలిచే జట్లు సూపర్-8కు క్వాలిఫై అవుతాయి. సూపర్-8 రౌండ్‌లో టాప్-4 జట్లు సెమీఫైనల్‌కు చేరుకుంటాయి. ఆ తర్వాత ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. ఈ ప్రపంచకప్‌లో మొత్తంగా 55 మ్యాచ్‌లు జరగనున్నట్లు తెలుస్తోంది. షెడ్యూల్.. ఫిబ్రవరి, మార్చి మధ్యలోనే ఉండే అవకాశం ఉంది. ఎందుకంటే జనవరి 11 నుంచి 31 వరకు భారత్, న్యూజిలాండ్ మధ్య వన్డే, టీ20 సిరీస్‌లు జరుగుతాయి. ఐపీఎల్ విండో మార్చి 15 నుంచి 31 వరకు ఉంటుంది. దీంతో ఫిబ్రవరి మొదటి వారంలో టీ20 ప్రపంచకప్ ప్రారంభించి.. ఐపీఎల్ ప్రారంభం కాకముందే టీ20 ప్రపంచకప్‌ను ముగించే అవకాశం ఉంది.



# ప్రాక్టీస్ సెషన్‌లో అభిషేక్ సిక్సర్ల వర్షం!

ఆసియా కప్ 2025 ప్రారంభానికి ముందు, యువ బ్యాటర్ అభిషేక్ శర్మ నెట్ సెషన్‌లో విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. గంటపాటు సాగిన ప్రాక్టీస్‌లో 25 - 30 సిక్సర్లు బాదినట్లు సమాచారం. యూఏఈతో జరిగే తొలి మ్యాచ్‌లో దూకుడుగా ఆడాలనే సంకేతాలను టీమిండియా పంపింది. సూర్యకుమార్ యాదవ్ కూడా తమ వ్యూహాన్ని స్పష్టం చేశాడు. ఈరోజు రాత్రి భారత్, యూఏఈ తలపడనున్నాయి. తుది జట్టులో ఆల్‌రౌండర్లకు ఎక్కువ అవకాశం ఉంటుందని తెలుస్తోంది. ఆసియా కప్ 2025 ఆరంభ మ్యాచ్‌కు ముందే టీమిండియా యువ బ్యాటర్ అభిషేక్ శర్మ తన దూకుడు ప్రదర్శనతో అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఆప్షనల్ నెట్ సెషన్‌లో అభిషేక్ ఒక్క గంటపాటు సాగిన బ్యాటింగ్‌లో 25 నుంచి 30 సిక్సర్లు బాదాడు. బౌండరీ బయటకు టార్గెట్‌గా పెట్టుకుని నెట్ ప్రాక్టీస్‌ను పూర్తిగా రేంజ్ హిట్టింగ్ ఎగ్జిబిషన్‌లా మార్చేశాడు. ఈ ప్రాక్టీస్ సెషన్‌లో సీనియర్లలో కొందరు విశ్రాంతి తీసుకున్నా, యాభై సిక్సర్లతో స్పాట్‌లైట్ మొత్తాన్ని తన వైపు తిప్పుకున్నాడు అభిషేక్. యూఏఈపై తొలి మ్యాచ్‌కు ముందు టీమిండియా లక్ష్యమేంటో అభిషేక్ నెట్ సెషన్‌తో చెప్పేసింది. స్కిప్పర్ సూర్యకుమార్ యాదవ్ కూడా ప్రెస్ కాన్ఫరెన్స్‌లో తన దూకుడు యత్నాలపై స్పష్టతనిచ్చాడు. అందుకోసమే అభిషేక్ శర్మ ప్రాక్టీస్ సెషన్‌లో జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా లాంటి బౌలర్లను ఎదుర్కొంటున్నాడు. "అగ్రెషన్ లేకుండా ఈ ఆట ఆడటం అసంభవం. మేము మైదానంలోకి అడుగుపెట్టినప్పుడు ఎప్పుడూ అగ్రెషన్‌తోనే ఉంటాం. నేను కూడా ఆతృతగా ఎదురుచూస్తున్నాను.. ఫ్రంట్‌ఫుట్‌లో ఆడేందుకు సిద్ధంగా ఉన్నాం" అని సూర్యకుమార్ యాదవ్ స్పష్టం చేశాడు. ఈ రోజు రాత్రి దుబాయ్ వేదికగా భారత్ - యూఏఈ మధ్య మ్యాచ్ జరగనుంది. మ్యాచ్ ప్రారంభానికి ముందే టీమిండియా తన వ్యూహం చెప్పేసింది. కేవలం హిట్టింగే టార్గెట్‌గా భారత్ బరిలోకి దిగే అవకాశం ఉంది. అందుకోసమే ప్లేయింగ్ 11లో కూడా ఆల్‌రౌండర్లకే ఎక్కువ ప్రాధాన్యత కల్పించనున్నారు. ఎనిమిదో స్థానం వరకూ బ్యాటింగ్ ఆడించాలి అని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ చూస్తున్నాడు. అభిషేక్ శర్మతో పాటు ఓపెనింగ్ దిగేది ఎవరు అనేదే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారనుంది. సంజూ శాంసన్‌కు అవకాశం ఇస్తారా లేక శుభమన్ గిల్‌ను పంపిస్తారా అనే దానిపై క్లారిటీ లేదు. ఎనిమిదో స్థానం వరకూ ఆడాలంటే జితేశ్ శర్మని జట్టులో తీసుకునే అవకాశం కూడా లేకపోలేదు. మొత్తానికి భారత్ ప్లేయింగ్ 11లో ఎవరు ఉంటారనే దాని కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. టీమిండియా జట్టు అంచనా అభిషేక్ శర్మ, శుభమన్ గిల్ , తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, శివమ్ దుబే, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ / సంజూ శాంసన్, వరుణ్ చక్రవర్తి, జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్.





# ఆసియా కప్‌లో ఆఫ్ఘనిస్థాన్ బోణీ

ఆసియా కప్ లో ఆఫ్ఘనిస్థాన్ శుభారంభం చేసింది. మంగళవారం టోర్నీ ఓపెనర్ గా హాంకాంగ్ తో జరిగిన మ్యాచ్ లో 94 పరుగులతో విజయం సాధించింది. అబుదాభిలోని షేక్ జయేద్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో టాస్ గెలిచి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘాన్.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 188 పరుగులు చేసింది. ఓపెనర్ సాదిఖుల్లా అటల్ స్టన్నింగ్ అజేయ ఫిఫ్టీ (52 బంతుల్లో 73 నాటౌట్, 6 ఫోర్లు, 3 సిక్సర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో ఆయుష్ శుక్లా, కించిత్ షాకు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం భారీ ఛేజింగ్ లో బరిలోకి దిగిన హాంకాంగ్.. ఓవర్లన్నీ ఆడి 9 వికెట్లకు 94 పరుగులు మాత్రమే చేసి, 94 పరుగులతో పరాజయం పాలైంది. బాబర్ హయాత్ (39) టాప్ స్కోరర్ గా నిలిచాడు. ఫజల్ హక్ ఫరూఖీ, గుల్బదిన్ నయిబ్ రెండేసి వికెట్లతో హాంకాంగ్ పతనాన్ని శాసించారు. దీంతో గ్రూప్-బిలో తొలి విజయాన్ని ఆఫ్ఘాన్ దక్కించుకున్నట్లయ్యింది. టోర్నీలో తర్వాతి మ్యాచ్ బుధవారం ఆతిథ్య యూఏఈ, ఇండియా మధ్య జరుగుతుంది. టాస్ గెలిచి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘాన్ కు శుభారంభం దక్కలేదు. ఆరంభంలోనే విధ్వంసక రహ్మానుల్లా గుర్బాజ్ (8), ఇబ్రహీం జద్రాన్ (1) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో వెటరన్ మహ్మద్ నబీ (33) తో కలిసి అటల్ ఇన్నింగ్స్ ను నిర్మించాడు. వీరిద్దరూ వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు కొడుతూ, వేగంగా పరుగులు జత చేశారు. మూడో వికెట్ కు 51 పరుగులు జతయ్యాక నబీ ఔటయ్యాడు. నయిబ్ (5) విఫలమైనా, అజ్మతుల్లా ఒమర్జాయ్ (21 బంతుల్లో 53, 2 ఫోర్లు, 5 సిక్సర్లు) తో కలిసి అటల్ ఆఫ్ఘాన్ కు భారీ స్కోరు అందించాడు. స్లాగ్ ఓవర్లలో వీరిద్దరూ సిక్సర్లతో రెచ్చిపోవడంతో ఆఫ్ఘాన్ అనుకున్నదానికంటే భారీ స్కోరు సాధించింది. భారీ టార్గెట్ ను చూసి బెంబేలెత్తిపోయిన హాంకాంగ్ చేతులెత్తేసింది. పేరుకు హాంకాంగ్ టీమ్ అయినప్పటికీ, మెజారిటీ ఇండియా, పాక్ సంతతి ప్లేయర్లే ఈ జట్టు తరపున ఆడుతున్నారు. అయితే ఆఫ్ఘాన్ కట్టుదిట్టమైన బౌలింగ్ కు వీరివద్ద సమాధానం లేకుండా పోయింది. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోతూ, మ్యాచ్ ను ఎప్పుడో ఆఫ్ఘాన్ కు అప్పగించింది. బాబర్ కాస్త పోరాటం చేయడంతో వంద పరుగుల మార్కు దగ్గరగా వెళ్లింది. ఈ ఫలితంతో ఆఫ్ఘాన్ కు ఈ టోర్నీలో తొలి విజయాన్ని సాధించింది. బౌలింగ్ లో ఒక వికెట్ తీసి, అర్ధ సెంచరీ చేసిన ఒమర్జాయ్ కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.




# పృథ్వీ షాకు కోర్టు జరిమానా



టీమిండియా క్రికెటర్ పృథ్వీ షాకు ముంబై కోర్టు షాకిచ్చింది. ముంబైలోని డిండోషి సెషన్స్ కోర్టు క్రికెటర్‌కు రూ.100 జరిమానా విధించింది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ సప్నా గిల్ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించని కారణంగా, బదులు ఇవ్వకపోవడంతో కోర్టు చర్యలు చేపట్టింది. కోర్టు గతంలో పృథ్వీ షాకు కౌంటర్ దాఖలు చేయడానికి చివరి అవకాశం ఇచ్చింది. అయినప్పటికీ అతని నుంచి ఎటువంటి స్పందన రాలేదు. ఫిబ్రవరి 2023న పృథ్వీ షా, సప్నా గిల్ మధ్య వివాదం జరిగింది. ముంబైలోని అంధేరి ప్రాంతంలోని ఒక పబ్లో పృథ్వీ షా, సప్నా గిల్ గొడవ పడ్డారు. సప్నా గిల్ తన స్నేహితురాలు పృథ్వీ షాతో సెల్ఫీ కోరిందని, క్రికెటర్ దానిని తిరస్కరించడంతో పాటు ఫోన్ లాక్కుని విసిరేశాడని ఆమె ఆరోపించారు. ఆ తర్వాత సప్నా గిల్ జోక్యం చేసుకోవడానికి ప్రయత్నించగా క్రికెటర్ షా, అతని స్నేహితులు తనపై దాడికి యత్నించారని, లైంగిక వేధింపులకు పాల్పడ్డారని సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ తీవ్రమైన ఆరోపణలు చేయడం కలకలం రేపింది. ఘటన తర్వాత తాను పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి నిరాకరించారని సప్నా గిల్ ఆరోపించింది. ఆ తర్వాత ఆమె అంధేరిలోని మెజిస్ట్రేట్ కోర్టులో దీనిపై పిటిషన్ దాఖలు చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో ఆలస్యం జరిగిందని ఏప్రిల్ 2024లో మెజిస్ట్రేట్ కోర్టు భావించింది, కాని ఆరోపణలు తీవ్రమైనవి, కాబట్టి విచారణ అవసరమని అభిప్రాయపడింది. సిఆర్పిసి సెక్షన్ 202 కింద విచారణ జరిపి నివేదిక సమర్పించాలని శాంతాక్రూజ్ పోలీసులనుట్ కోర్టు ఆదేశించింది. తనకు వ్యతిరేకంగా నమోదైన పిటిషన్‌కు పృథ్వీ షా బదులివ్వకపోవడాన్ని సెషన్స్ కోర్టు తీవ్రంగా పరిగణించి, క్రికెటర్‌కు జరిమానా విధించింది. మరోవైపు దర్యాప్తు నివేదిక ఈ కేసులో మరింత కీలకం కానుంది. బాధితురాలిగా చెప్పుకుంటున్న సప్నా గిల్ తరపున వాదిస్తున్న లాయర్ అలీ కాషిఫ్ ఖాన్ దేశ్ముఖ్ మాట్లాడుతూ.. ముంబైలోని డిండోషి సెషన్స్ కోర్టు భారత క్రికెటర్ పృథ్వీ షాకు రూ.100 జరిమానా విధించింది. ఇన్‌ఫ్లూయెన్సర్ సప్నా గిల్ ఫైల్ చేసిన క్రిమినల్ రివిజన్ పిటిషన్లో పదేపదే తన సమాధానం ఇవ్వకుండా దాటవేస్తున్నందుకు షా మీద కోర్టు చర్యలు తీసుకుంది. సప్నా గిల్ ఫిబ్రవరి 2023లో ముంబైలోని అంధేరిలో ఉన్న ఒక పబ్లో పృథ్వీ షా, అతడి స్నేహితులు తనను కొట్టారని, లైంగిక వేధింపులకు పాల్పడ్డారని తీవ్ర ఆరోపణలు చేసింది. విచారణ చేపట్టిన కోర్టు క్రికెటర్ వివరణ కోరుతూ షాకు చాలాసార్లు సమన్లు పంపించింది. కానీ సప్నా గిల్ చేసిన ఆరోపణలపై కోర్టు ఇచ్చిన సమన్లకు పృథ్వీ షా స్పందించలేదు. కోర్టు మరోసారి గడువు ఇచ్చిందని, త్వరలోనే తన క్లయింట్ కు న్యాయం జరుగుతుందని దేశ్ముఖ్ అన్నారు. విచారణను వాయిదా వేయడం క్రికెటర్ షా ప్లాన్ అని సప్నాగిల్ లాయర్ దేశ్ముఖ్ అన్నారు. షా తన దుష్ప్రవర్తనపై ఖచ్చితమైన సమాధానం ఇవ్వలేకపోతున్నాడు. ఈ కేసు తదుపరి విచారణ డిసెంబర్ 16కు వాయిదా పడినట్లు ఆయన తెలిపారు.

# తండ్రి అయిన వరుణ్ తేజ్...

## మగ బిడ్డకు జన్మనిచ్చిన లావణ్య..





మెగా కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. ప్రముఖ నటుడు వరుణ్ తేజ్, ఆయన సతీమణి, నటి లావణ్య త్రిపాఠి తల్లిదండ్రులయ్యారు. హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో లావణ్య ఓ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. ఈ వార్త తెలియగానే మెగా అభిమానులు, సినీ ప్రముఖుల నుంచి సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.విషయం తెలిసిన వెంటనే మెగాస్టార్ చిరంజీవి తన కొత్త చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు' షూటింగ్ నుంచి నేరుగా ఆసుపత్రికి చేరుకున్నారు. అక్కడ వరుణ్ తేజ్, లావణ్యలను కలిసి తన అభినందనలు, ఆశీస్సులు అందజేశారు. కుటుంబంలోకి కొత్త సభ్యుడి రాక పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం తల్లీబిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.వరుణ్, లావణ్యల ప్రేమ వివాహం గతేడాది జరిగిన విషయం తెలిసిందే. ఇప్పుడు తమ కుటుంబంలోకి చిన్నారి అడుగుపెట్టడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఈ శుభవార్తతో కొణిదెల కుటుంబంలో పండుగ వాతావరణం నెలకొంది.

# నిర్మాతగా శర్వానంద్ కొత్త ఇన్నింగ్స్..

# 'ఓమీ' ప్రొడక్షన్ హౌస్ ప్రారంభం!

టాలీవుడ్‌లో ఫ్యామిలీ హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు శర్వానంద్ ఇప్పుడు నిర్మాతగా సరికొత్త ప్రయాణాన్ని ఆరంభించారు. ఆయన 'ఓమీ' పేరుతో ఒక నిర్మాణ సంస్థను స్థాపించారు. ఈ సంస్థను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శర్వానంద్ తన భవిష్యత్ ప్రణాళికలను మీడియాకు వివరించారు.'ఓమీ' అనేది కేవలం ఒక బ్రాండ్ మాత్రమే కాదని, భవిష్యత్ తరాల కోసం ఒక దార్శనికతతో దీనిని ప్రారంభిస్తున్నట్లు శర్వానంద్ తెలిపారు. నిబద్ధత, మంచి సంకల్పం, బాధ్యతలతో కూడిన ఒక కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సంస్థ ద్వారా సృజనాత్మకత, ఐక్యత, సుస్థిరత వంటి విలువలకు ప్రాధాన్యతనిస్తూ 100 శాతం సహజమైన కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.ఇప్పటివరకు వెండితెరపై చెప్పని కథలను తన నిర్మాణ సంస్థ ద్వారా చెప్పేందుకు ప్రయత్నిస్తానని శర్వానంద్ పేర్కొన్నారు. నటీనటులు, సృజనాత్మక నిపుణులను ఏకతాటిపైకి తీసుకొచ్చే వేదికగా 'ఓమీ' నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. కేవలం సినిమాలు నిర్మించడమే కాకుండా, ఆరోగ్యం, ప్రకృతితో మమేకమయ్యే జీవనశైలిని ప్రోత్సహించడం కూడా తమ సంస్థ ఉద్దేశమని ఆయన వెల్లడించారు. ఈ కొత్త పయనంతో చిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేసేందుకు శర్వానంద్ సిద్ధమయ్యారు.




# పొట్టి డ్రెస్సులో అనన్య లుక్..

## గ్లామర్‌కి కొత్త డెఫినిషన్

టాలీవుడ్‌లో తన సింపుల్ అండ్ న్యాచురల్ యాక్టింగ్‌తో గుర్తింపు తెచ్చుకున్న అనన్య నాగళ్ల, ఇప్పుడు సోషల్ మీడియాలో తన ఫ్యాషన్ స్టైల్‌తోనూ కుర్రాళ్ళ దృష్టిని ఆకర్షిస్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫొటోలు దీనికి నిదర్శనం. మెటాలిక్ సిల్వర్ డ్రెస్‌లో స్పార్క్‌లా మెరిసిపోయిన అనన్య, పవర్ మోడ్‌లో ఉన్నట్లు చెప్పుకుంటూ ఈ ఫోటోషూట్‌ను పంచుకుంది. క్యాజువల్ గానే కాకుండా స్టైలిష్ గా కనిపించే ఈ లుక్‌లో ఆమె కాన్ఫిడెన్స్ స్పష్టంగా కనిపించింది. రెడ్ లగ్జరీ కార్‌తో చేసిన ఫొటోషూట్, గ్లామర్‌ని కొత్త స్థాయికి తీసుకెళ్లింది. డ్రెస్ కాంబినేషన్, మేకప్, హెయిర్ స్టైల్ అన్నీ కలిపి అనన్య వ్యక్తిత్వాన్ని హైలైట్ చేశాయి. ఈ లుక్‌ను చూసిన అభిమానులు సోషల్ మీడియాలో మంచి రియాక్షన్స్ ఇస్తూ, "గ్లామరస్, క్లాసీ" అంటూ కామెంట్లు చేస్తున్నారు. అనన్య నాగళ్ల కెరీర్ విషయానికి వస్తే, ఆమె "మల్లేశం" సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టి నటనలో ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. ఆ తర్వాత "వకీల్ సాబ్"లో పవన్ కళ్యాణ్ పక్కన కనిపించి అందరి దృష్టిని ఆకర్షించింది. సాధారణమైన పాత్రలనుంచి సీరియస్ రోల్స్ వరకు చేస్తూ తనలోని వైవిధ్యాన్ని చూపించడంలో ఆమె విజయవంతమైంది. ఇక ఇటీవల అనన్య కొన్ని వెబ్ ప్రాజెక్టులు, సినిమాలతో బిజీగా గడుపుతోంది. తనకంటూ ప్రత్యేకమైన అభిమాన వర్గాన్ని కూడా సొంతం చేసుకుంది. యాక్టింగ్ మాత్రమే కాకుండా, ఫ్యాషన్ ఫీల్డ్‌లోనూ తనదైన గుర్తింపును తెచ్చుకోవాలని ప్రయత్నిస్తోంది. అందుకే తరచూ ఇలాంటి కొత్త లుక్స్‌తో సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటోంది.





# నయనతారకు నోటీసులు పంపిన మద్రాస్ హైకోర్టు



ప్రముఖ సినీ నటి, లేడీ సూపర్‌స్టార్‌గా పేరు పొందిన నయనతార న్యాయపరమైన చిక్కుల్లో పడ్డారు. ఆమె జీవితం ఆధారంగా ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన 'నయనతార: బియాండ్ ది ఫెయిరీటేల్' అనే డాక్యుమెంటరీ తాజా వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. ఈ డాక్యుమెంటరీలో తమ సినిమాలకు చెందిన క్లిప్పులను అనుమతి లేకుండా ఉపయోగించుకున్నారని ఇద్దరు నిర్మాతలు కోర్టును ఆశ్రయించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.వివరాల్లోకి వెళితే, ఈ డాక్యుమెంటరీలో 'చంద్రముఖి' సినిమాకు సంబంధించిన కొన్ని క్లిప్పులను, 'నాన్ రౌడీ ధాన్' చిత్రానికి చెందిన తెర వెనుక ఫుటేజీని తమ అనుమతి లేకుండా ఉపయోగించుకున్నారని ఆయా చిత్రాల నిర్మాతలు ఆరోపిస్తున్నారు. ఇది కాపీరైట్ నిబంధనలను ఉల్లంఘించడమేనని వారు పేర్కొన్నారు.దీంతో 'చంద్రముఖి' నిర్మాత ఏపీ ఇంటర్నేషనల్, 'నాన్ రౌడీ ధాన్' నిర్మాత అయిన నటుడు ధనుష్‌కు చెందిన నిర్మాణ సంస్థ కలిసి మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. బుధవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, నయనతారతో పాటు ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌కు కూడా నోటీసులు జారీ చేసింది. ఈ వివాదంపై అక్టోబర్ 6వ తేదీలోగా తమ వివరణ సమర్పించాలని ఆదేశించింది.న్యాయస్థానం ఆదేశాలతో ఈ వ్యవహారం కోలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ నోటీసులపై నయనతార, నెట్‌ఫ్లిక్స్ ఏ విధంగా స్పందిస్తాయో వేచి చూడాలి.



# ఓజీ స్పెషల్ : 33 అవతార్‌లో పవన్ కళ్యాణ్..!

విడుదలకు మరో రెండు వారాల సమయం మాత్రమే ఉన్న నేపథ్యంలో థియేటర్ల వద్ద హడావిడి మొదలు అయింది. ఈ సినిమా విడుదల సందర్భంగా పవన్ ఫ్యాన్స్ భారీ కటౌట్లు ప్లాన్ చేస్తున్నారు. ప్రతి హీరో ఫ్యాన్స్, నిర్మాతలు కటౌట్స్‌ను ఏర్పాటు చేయడం మనం చూస్తూ ఉంటాం. కానీ ఓజీ సినిమా థియేటర్ వద్ద ఉండబోతున్న కటౌట్‌లు చాలా స్పెషల్ అంటూ పవన్ ఫ్యాన్స్ బల్ల గుద్ది మరీ బరాబర్ చెబుతున్నారు. కూకట్‌పల్లిలో భారీ కటౌట్‌ల ఏర్పాటు హైదరాబాద్ కూకట్‌పల్లి విశ్వనాథ్ థియేటర్ వద్ద ఏకంగా 33 కటౌట్‌లను పవన్ కళ్యాణ్ అభిమానులు ఏర్పాటు చేయబోతున్నారు. పవన్ కళ్యాణ్ ఇప్పటి వరకు అన్ని సినిమాల్లో నటించలేదు. కానీ కొన్ని పొలిటికల్ కటౌట్‌లు, కొన్ని గెస్ట్ రోల్స్ పోషించిన కటౌట్‌లను ఏర్పాటు చేయబోతున్నారు. ఇప్పటి వరకు పవన్ నటించిన ప్రతి సినిమా నుంచి ఒక కటౌట్‌ను ఏర్పాటు చేయబోతున్నారు. జనసేనానిగా ఒక కటౌట్, ఉప ముఖ్యమంత్రిగా ఒక కటౌట్ ఇలా మొత్తంగా పవన్ కళ్యాణ్‌కి సంబంధించిన 33 కటౌట్‌లను ఏర్పాటు చేయడం ద్వారా పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అరుదైన రికార్డ్‌ను సొంతం చేసుకోబోతున్నారు. ఒక్క హీరోకు 33 కటౌట్‌లను ఇప్పటి వరకు ఏ ఒక్క హీరోకు లేదా హీరోయిన్‌కి అభిమానులు పెట్టలేదు. కనుక పవన్ ఓజీ సినిమా విడుదల సందర్భంగా ఫ్యాన్స్ పెట్టబోతున్న కటౌట్‌లు రికార్డ్‌ను నమోదు చేయబోతున్నారు.

# 3డీ యానిమేషన్ మూవీ 'వాయుపుత్ర'..

ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన 3డీ యానిమేషన్ చిత్రం మహావతార్ నరసింహ ఎలాంటి హిట్ అయిందో అందరికీ తెలిసిందే. కేవలం రూ.40 కోట్ల బడ్జెట్ తో రూపొందిన ఆ సినిమా.. ఇప్పటి వరకు రూ.300 కోట్లకు పైగా కలెక్షన్స్ సొంతం చేసుకుని సత్తా చాటుతోంది. ఎలాంటి అంచనాలు లేకుండా రిలీజ్ అయ్యి.. ఇప్పుడు అనేక రికార్డులు కొల్లగొడుతోంది. అయితే కన్నడ సినీ ఇండస్ట్రీ నిర్మించిన ఆ సినిమా పాన్ ఇండియా రేంజ్ లో అదరగొడుతోంది. ఇప్పుడు టాలీవుడ్ లో కూడా యానిమేషన్ చిత్రాల సందడి మొదలైంది. ప్రముఖ సితార ఎంటర్టైన్మెంట్స్ సంస్థ 3డీ యానిమేషన్ వాయుపుత్ర సినిమా నిర్మిస్తున్నట్లు ప్రకటించింది. ఫస్ట్ లుక్ పోస్టర్, రిలీజ్ మంత్ ను కూడా అనౌన్స్ చేసింది. %ూశ్రీంశీ =ముఃం% – మెగా గుడ్ న్యూస్ చెప్పిన వరుణ్ తేజ్ సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై నాగవంశీ నిర్మిస్తున్న ఆ సినిమాను చందు మొండేటి తెరకెక్కిస్తున్నారు. డివోషనల్ జోనర్ లో కార్తికేయ మూవీతో మంచి హిట్ అందుకున్న ఆయన ఇప్పుడు వాయుపుత్ర మూవీ చేస్తుండడం విశేషం. 2026 దసరా సందర్భంగా తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో పాన్ ఇండియా రేంజ్ లో రిలీజ్ కానుంది చిత్రం. అయితే వాయుపుత్ర అనౌన్స్మెంట్ పోస్టర్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారి.. ఓ రేంజ్ లో అందరినీ ఆకట్టుకుంటోంది. హనుమంతుడు కొండపై నిలబడి, దహనమవుతున్న లంకను చూస్తున్న పవర్ ఫుల్ పోస్టర్.. సినిమా ద్వారా మేకర్స్ అందించాలనుకుంటున్న ఇతిహాస స్థాయి, ఆధ్యాత్మిక లోతును ఆడియన్స్ కు క్లియర్ గా అర్థమయ్యేలా చెబుతోంది. కేవలం సినిమా కాదు, థియేటర్లను దేవాలయాలుగా మార్చే పవిత్ర దృశ్యంగా కనిపిస్తోంది. మునుపెన్నడూ లేని విధంగా భక్తి పారవశ్యంలో ఆడియన్స్ ను ముంచేయడానికి సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది.

